UNIVERSAL LIBRARY
OU_204724
UNIVERSAL LIBRARY

—731—28-4-81—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

No. T82 SKASP Accession No. T10575

or [illegible] 1924.

book should be returned on or before the date last marked below

# ఈనాటకమునందు వచ్చు పాత్రలు.

## పురుషులు.

దశరథుఁడు—అయోధ్యాపురాధీశ్వరుఁడు.

| | |
|---|---|
| శ్రీరాముఁడు<br>లక్ష్మణుఁడు<br>భరతుఁడు<br>శత్రుఘ్నుఁడు | దశరథుని కొడుకులు. |

వసిష్ఠుఁడు.—సూర్యకులమువారి పురోహితుఁడు.

సుమంత్రుఁడు—సారథి.

గుహుఁడు—నిషాదుఁడు.

## స్త్రీలు.

| | |
|---|---|
| కౌసల్య<br>కైక<br>సుమిత్ర | దశరథుని భార్యలు. |

సీత—రాముని భార్య.

మంథర—కైక దాసి.

శ్రీ

# పాదుకా పట్టాభిషేకము

(నాలుగంకముల నాటకము:)

## ప్రథమాంకము.

[సమాజకులందఱుకలిసి తెరలో పాడెడిప్రార్థన పాట.]

దేవగాంధారిరాగం—ఏకతాళము.

ప॥ శ్రీరమణీయ । తనువిలాస । స్వయంభూ । శేషశాయీ
పాహిపాహిమాం పాహిమాం॥శ్రీ॥

అ॥ ప॥ కారుణ్యామృతపూరా । క్రూరరాక్షస సంహారా
భారతమాతృపుత్రులము । భవత్పాదభక్తులము
శ్రీరామపట్టాభి । షేకము । నాటక । రూపక । ముగ నేము ।
ప్రదర్శింప
కోరికతోనిను । గోరితిమీ దేవ । కొరతలు రానీక । బ్రోతువంచు॥
శ్రీ ।

రంగము:—[సాకేతపురమున కైకమందిరము ముందు
మంధర—ప్రవేశము.]

[సుందర ప్రవేశమున పాడెడిపాట.]

కల్యాణిరాగం—ఆదితాళము.

ప॥ యేమిటింత । ఇదియెవింత । చూడచూడ । నాకెంతో । అద్భుతముగనుండె॥ యేమి॥

అ॥ ప॥ యేమియుదోచదే । యెన్నివిధంబుల । యోచనజేసిన నాహృదయమునకు॥ యేమి॥

యింటయింటతోరణములు । అందందు వీరణములు యింపుగుల్కు వాయిద్యములు అద్భుతముగనుండెన్॥

మంధ—(తనలో) ఏమి చెపుదునూ! నేఁడయోధ్యాపురంబంతయునింత చక్కఁగ నలంకరింపఁబడినది. ఎచ్చోటఁ జూచినను మంగళధ్వనులే వినిపించుచున్నవి. ఎటుజూచినను శ్రీహరింగీర్తించు భక్తసముదాయమే. అదేమిటి! ఆప్రక్క వేశ్యలు నాట్యము సలుపుచున్నారు. అదిగో! ఆవంక బాలురుకొందఱు రామునకు జయమగుఁగాక! జయమగుఁగాకయని పలుకుచున్నారు. ఈయలంకారము లేమిటి! ప్రతిగృహము తోరణంబులచేనలంకరింపఁబడియుండెను. పురమునందెల్లెడ భానుదీప్తిని ఖండింపఁజాలిన దీపపంక్తులు బెట్టిరే! (ఎదుటజూచి) ఏమిటా కాంతి! సూర్యుఁడు నేలకుదిగివచ్చెనాయని తోఁచునట్లు శ్రీరామునిసాధనమునున్న దీపసమితి మిగులఁబ్రకాశించుచున్నదే. ఇదియంతయుఁజూడఁగా నాకుమిగులఁ జోద్యముగానున్నది. (ఆలోచించి) ఈపురంబిట్లు శృంగారింపఁబడియుండుట కేమికారణము. దీనికేదియో యొకగొప్పకారణ ముండితీరవలయును. దశరథునకుఁ బుత్రోదయము గలిగిననాఁడైనను నీపురంబిట్లలంకరింపఁబడియుండలేదు. జ్వరబాధచే రెండుదినములనుండి గృహమువిడి

చి రాకపోవుటచే వార్తలేమియును దెలియకున్నవి. (ఎదుటజూచి) అదిగో! ఎవ్వఁడో వృద్ధకంచుకి యిట్లువచ్చుచున్నాఁడు. వీనినిగనుఁగొనిన సమస్తమును తెలియును.

[కంచుకిప్రవేశించును.]

కం—(తనలో) తెల్లవారిన శ్రీరామపట్టాభిషేకము జరుపఁబడునఁట! పట్టాభిషేకమహోత్సవసమయమున మాను మహారాజుగారు సేవకులకందఱకును నొక్కొక్క నెలజీత ముచితముగానిత్తురఁట. ఆహా! సంతోషసమయమునఁ జేయు దాతృత్వమిట్లుండవలెనుగదా!

మం—(కంచుకినిజూచి) ఓయి! కంచుకీ! నేఁడీనగరమింత శృంగారింపఁబడియుండుటకుఁ గారణమేమి? మహారాజుగారి కొలువుకూటముననుండు నీకుఁదెలియనివిషయము లుండవుగాన నడుగుచున్నాను.

కంచు—ఓహో! మంధరవా! ఈనగర మెందులకిట్లలంకరింపఁబడియున్నదో కారణము నీకుఁ దెలియనేలేదు కాఁబోలు! అవును. కైకమ్మగారు నీకుఁ బెట్టుచున్నకూడు నీశరీరమును కొవ్వుబట్టఁ జేసినది.

మంధ—నీమాటలుజాలించి కారణము జెప్పుము.

కంచు—రేపు శ్రీరామచంద్రపట్టాభిషేక మహోత్సవము. ఇంత కంటెఁగావలసిన కారణమేమున్నది?

మంధ—(తనలో) ఏమీ! శ్రీరామునిపట్టాభిషేకమహోత్సవమా? (ప్రకాశముగా) కంచుకీ! ఈయభిషేకోత్సవ మింతతొందరగాఁ జేయుటకు రాజుగారి కేల యవసరముగలిగినది?

కంచు—తొందరయేమున్నది. రాజ్యాభిషిక్తుఁడవుటకు శ్రీరామునకుఁ

దగినవయస్సు వచ్చియుండుటచేత నే; ఎప్పుడైనను జేయవల సినదే. (ఇంచుక యూరకుండి) నీతోఁ గాలయాపనఁ జేయుచుండుటకు నాకు పీలులేదు. నే నేగవలెను.

(నిష్క్రమించును.)

మంథ—(తనలో) రేపు శ్రీరామచంద్రపట్టాభిషేక మహోత్సవము జరుపఁబడునఁట. నే నెట్లయిన నీయభిషేకోత్సవమున కంతరా యము గల్గింపవలయును. (ఆలోచించి) రాజ్యపరిపాలనార్హుం డగు శ్రీరామచంద్రుఁడు రాజగుచుండఁగా దీనికి నేను భంగ ముఁగలిగించినందువలనఁ బ్రయోజనమేమున్నది ? ప్రయో జనమేమి. ఒకరి మేలుఁజూచి యోర్వలేకపోవుట నాకుసహజగు ణము. ఈవిషయమై నాప్రయత్నము ఫలించునాలేదా యని మాత్రము నేనాలోచింపవలసియున్నది. (ఆలోచించి) ఫలింప కేమి ! కైక నాచేతిలో జంత్రపుబొమ్మయేకదా? నేనెట్లుచెప్పి న నట్లునడుచుకొనును. ఆమెను మాయలోఁబడవేసి, యామె చేత దశరథుని భరతునకుఁ బట్టముగట్టుమని యడిగించెద. కాని, శ్రీరామపట్టాభిషేకమునకంతరాయముగలిగించినందు వలన నే నందులాభ మేమి. (జ్ఞప్తికిఁదెచ్చుకొని)ఆ! మఱచిపోయి తిని. మున్నొకసారి మాతాత, శ్రీరాముఁడు కొన్నివత్సరము లరణ్యవాసియైచనుననియు, నాకారణమున దుష్టదైత్య సంహా రముజరిగి భూభారముతగ్గుననియుఁ జెప్పినాఁడు. కావున నేనీవి షయమై యింక సంశయింప నక్కరలేదు. (ఇంచుకనడచి) ఇదిగో ! కైకమందిరము.

[తెరలేచును.]

[కైక మందిరమునశయనించియుండును.]

[కైకమందిరమున మంధర ప్రవేశించి పాడెడిపాట.]

బేహాగ్ రాగం—ఏకతాళము.

ప॥ ఇదియేగదా ! రాముని పైగల క్రోధముదీరగయద । నిదియే
గదా॥

అ॥ ప॥ సుదినముగదయీ దినము । నామనమున ॥
పదిలపరచిన పగసాధింపక (కైకనుజూచి)
నిదురించుచుండె నీ । నెలత నేడేలనో
వదనముగాథని । ద్రావస్థ చెందె ॥ఇదియే॥

మంధ—(కైకంజూచి) ఇదిగో ! ఈమె నిద్రించుచున్నది. సమీపించె దఁగాక. (సమీపించి) కైకా ! కైకా ! ఎప్పుడును నీకు నిద్రయేనా ?

కైక—(లేచి) ఏమి ! మంధరా ! ఇంతరాత్రివేళ వచ్చితివి ?

మంధ—ఇప్పుడేమంత పొద్దుబోయినది ?

కైక—ఎందుచేతనోగాని నిద్రాదేవి నన్ను నేఁడు త్వరగా నావహించినది.

మంధ—పాపము ! రేపుజరుగనున్న కార్యమునకుఁ గావలసినపను లన్నియుఁ బగతెల్లఁజేసి మిగులనలసియుంటివి కాఁబోలు !

కైక—రేపేమికార్యము ?

మంధ—అబ్బా ! ఎంతజాణవు ! రేపేమి కార్యమో తెలియదా ? పురమునిండ తాళములు తప్పెట్లు తెగమ్రోగుచుండఁగా నీకు నిద్రయెట్లువచ్చినది ?మనపురము నేఁడు అమరావతిని మించి యుండున ట్లలంకరించిరే ! ఇదేమియు నీకుఁ దెలియకుండఁ జే యుండెనా ?

కైక—నిజముగా నాకేమియుఁ దెలియదు.

మంధ—నీనాథుఁడు నీకీవిషయమై యేమియుఁజెప్పనేలేదా ?

కైక—నాకేవిషయమును జెప్పలేదు. చెప్పినచో నీకుఁజెప్పకదాఁచెదనా ! నీకన్న నాకాప్తులెవ్వరు ?

మంథర—అవును. ఎందుకుచెప్పును ? పోనిమ్ము; నాకుమాత్రమేల, జరుగనున్నది జరుగకమానదు. నీకుఁదెలియకమానదు. ఇంతలో నేనుతొందరవడనేల ?

కైక—మంథరా ! ఎందుకీయనవసరమైనమాటలు! నాకేమియుం దెలియదని చెప్పితిని. ఆసంగతియేదోవినుటకు నాచిత్తము తత్తరపడుచున్నది.

మంథ—నీనాథుఁడు నీకుఁ జెప్పకుండనే యీకార్యము జేయుచున్నాఁడా యని సంశయము గలుగుచున్నది.

కైక—ఏకార్యము ?

మంథ—ఏమున్నది. రేపు శ్రీరామచంద్రునకుఁ బట్టాభిషేకమహోత్సవముఁ గావించునఁట.

కైక—(సంతోషముతో) ఏమేమీ ! మంథరా ! శ్రీరామచంద్రపట్టాభిషేకమహోత్సవమా ! ఆహా ! నేఁడు కర్ణము లెట్టి పుణ్యమును నోచుకొన్నవోగదా! ఎప్పుడు శ్రీరామచంద్రపట్టాభిషేకమహోత్సవము గావింపఁబడునో, ఎప్పుడు నేను దానిని నయనానందకరముగఁ జూడఁగలుగుదునోయని వేచియుంటిని. నాకోరిక నేఁటికి ఫలించినది. నాకీవార్త వినిపించి శ్రవణోత్సవము గలిగించినందులకీ పచ్చలహారమున గైకొనుము.

(హారమిచ్చుచున్నది.)

మంథ—(పుచ్చుకొనక) ఈహారము నీవద్దనే యుంచుము. పరిచారికనగునాకిట్టి యమూల్యాభరణమేల. (తనలో) రామచంద్రుని పట్టాభిషేకమని చెప్పినంతనే యీమెకు మితిమీరిన సంతోషము కలిగినది. ఈమె నాయుద్యమమున కంగీకరించునా

లేదాయని సంశయముగలుగుచున్నది. కానిమ్ము; ఇంతమా
త్రముచేత నేను నిశ్చింపపెట్టరాదు. (ప్రకాశముగా) ఈవార్త
నీకంతసంతోషదాయకంబుగ నున్నదా ?

కైక—మంథరా !

తే. గీ. రవికులాంభోధిచంద్రుండు రమ్యగుణుఁడు
బుత్రులందఱిలోఁ బెద్ద పూతచరితుఁ
డట్టి శ్రీరామమూర్తి పట్టాభిషేక
మన్న నాకు సంతోషదాయకముగాదె !

మంథ—ఈమహోత్సవము నీకు సంతోషమేమోగాని నాకుమా
త్రముగాదు.

కైక—నీవట్లు పలికెదవేల? రాజ్యార్హుఁడును సుగుణమూర్తియు
నగు రఘునందనుని యభిషేకోత్సవము నీకును నాకునేగాక
ప్రజలందఱికును సంతోషదాయకమేయని యెఱుంగుము.

మంథ—నీవు వట్టి బేలవు. అందుచేతనే యిట్లు పలుకుచుంటివి. ఈ
యభిషేకోత్సవము నీకుఁ జింతఁగూర్చునుగాని సంతోష
ముకాదు.

కైక—ఏమేమీ ! ఇది నాకుఁ జింతఁగూర్చునా !

మంథ—సంశయమేమున్నది ? పోనిమ్ము ! నీనాథునకుఁ దక్కిన భా
ర్యలకంటె నీయందను రాగమెక్కువయని పలుకుచుందువు క
దా, ఈయభిషేకోత్సవమును గూర్చి నీతో నెప్పుడైన బలికి
యుండెనా ? తెల్లవాఱినఁగదా కార్యము; ఇప్పటికైనఁ జెప్పి
యుండెనా !

కైక—మంథరా ! రాచకార్యముల కొందరలో నుండుటచేత మఱ
చిపోయి యుండవచ్చును. అదియుంగాక నాతోఁ జెప్పిననేమి,
చెప్పకున్ననేమి !

మంధ—రాచకార్య విషయముల తొందర కాదు. అస్తమానము కౌసల్యతో గుసగుసలాడుచు వచ్చుటకు తీరుబడి లేకపోవుటచేత. మఱియు నీతోఁజెప్పినచో నిక్కార్యమునకు నీవేమి యంతరాయము గలిగింతువోయని తలంచి యుంటిని.

కైక.—ఎంత వెఱ్ఱిమాటఁ బలికితివి. అనుగుణభద్రుండగు రామభద్రుని యభిషేకమునకు నే నంతరాయము గలిగింతునా! నేనంత పాపచిత్తనా!

మంధ—నీవు పాపచిత్తవో పుణ్యచిత్తవో నాకుఁదెలియదు. నీకొంప మునుఁగుచున్నదను సంగతి నీకుఁ దెలియకున్నది. నీ తెలివియిట్లున్నది. ఇద్దిన దినములనుండియు నీవు గడుసుదానవని తలంచితిని. సపత్నీసుతుఁడగు శ్రీరాముఁడు రాజగుచుండఁగా నివ్వుసంతసింపుచుంటివా! శ్రీరాముఁడు రాజైనచో నివ్వు కౌసల్య చెప్పుచేతలలోనుండవలయును. భరతుఁడును నొకసేవకుఁడై యుండును. మిమ్ముఁదలఁచుకొన్న నాకెంతయు వగపుగలుగుచున్నది. నాచేతులతోఁ బెంచినభరతుఁ డొకరికి సేవకుఁడై యుండఁగా నేను కన్నులార జూచుచు నోర్వఁగలనా! నీకుఁ జేతనైనచో భరతునకుఁ బట్టంబుగట్టించుకొనుము. లేనిచో నీవందు పాట్లకు మితిలేక యుండును.

కైక—మంధరా! నీవెంతయు నజ్ఞానాబ్ధిలో మునిఁగిపోతివి. శ్రీరామచంద్రుని హృదయము నీవెఱుఁగవు.

[కైక పాడెడిపాట.]

మోహనరాగము - చాపుతాళము.

ప॥ యిటులాడఁగతగునె। ఇనుమంతయునీమదియోచింపక॥ యిటు॥

అ॥ ప॥ పట్టాభిషిక్తుండగుటకు । పావననాముండు రాముడుతగడని వచియింతువే॥ యిటు॥

## ప్రథమాంకము.

పితృభక్తితత్పరుండు । పురజనులకు ప్రియాకరుండు
పుత్రులలో పూజ్యుండు । మాతృసేవమరువనివాడు" యిటు॥

తే. గీ. భరతుకంటెను నాయందు । భక్తిమిగుల
బూని చరియించునట్టి స । త్పుణ్యమూర్తి
తగఁడొ యతఁడు రాజ్యమునేల । తమ్ములెల్ల
నతని సేవింపరాదొకో । క్షితితలమున.

తే. గీ. విద్యయందు బృహస్పతిన్ । విమలభక్తి
యందుఁ బ్రహ్లాదుహసియించి । యలరుననుచు
జనులు నుతిసేతురా రామ । చంద్రు; నట్టి
వాఁడు రాజ్యంబునేలగా । వలనుపడదా!

అతఁడీ సాకేతరాష్ట్రమే కాదు. పదునాల్గు లోకములను పాలింపఁదగిన సమర్థుఁడని యెఱుఁగుము, ఆరామచంద్రుఁ డెప్పుడును నసత్యమాడఁడు. శరణన్నవారిని విడిచిపెట్టఁడు. అతని సుగుణములఁ బొగడుటకు వేనోళ్ళచిలువకైనఁ దరముగాదు. బాలుఁడైయుండఁగనే గాధేయుని సవనముఁగాపాడి, యహల్యాశాపము వాపి, హరచాపమును ఖండించి జనకరాజతనూజను వివాహమాడినాఁడు. అట్టి శ్రీరామచంద్రుఁడు రాజగుటఁజూచి యెవ్వరు సంతోషింపక యుందురు ?

ఉ. ఆరఘురామచంద్రుఁడు ధ । రాధిపులెల్లను భక్తిఁగొల్వ నీ
ధారుణికెల్ల నేతయయి । ధర్మముదప్పక యేలుగాదె; యిం
పారఁ బ్రజాళిచిత్తముల । నంచితమోదమునందఁ దమ్ములున్
జేరి భజింప సంతతము । శిష్టజనంబులు మెచ్చునట్లుగన్.

[మంధర, కైక పాడెడి డైలాగ్ పాట.]

కేదారరాగం - ఏకతాళము.

మంధ—ప॥ చాలుచాలునోచేల యీలీల బలుక పైవచ్చుసంగతి
దెలియక॥ చాలు॥

అ॥ ప॥ పలుమాటలింక నాకేల॥ చిరకాలమునుంచినీమోి॥
మెలగినదాన। నగుటనోచాన । నీమేలుదలచిపల్క-
తిని॥ చాలు॥

కైక—ఆలకింపుము. నాకేమిభయము! నాప్రాణనాధుఁడునాపాలినుండ

మంధ—మేలుమేలు వెఱ్ఱిదాన! నీగర్వమింకచాలు ముప్పుగల్గు నీకు
ముందు॥ చాలు॥

మంధ—కైకా! నీవు వట్టిమూర్ఖురాలవు. లోకజ్ఞానము బాగుగా తెలి
యదు. రాజ్యప్రాప్తి యెట్టిమంచివానికైనను గర్వము గలుగఁ
జేయును. శ్రీరాముఁడు నృపతియైనచో భరతుని వనవాసిగఁజే
సితీరును. లక్ష్మణుండు రాముని నిరంతరమును సేవించుచునుం
డుటచేత నాతనికెట్టికీడును సేయఁడు. నీకా కౌసల్యదగ్గఱ సేవ
కావృత్తి తప్పదు. ఇంతకుమున్ను దశరథునకు నీయెడల నెక్కు-
వ ప్రేమకలదని గర్వింపుచుందువు. కావున, నీవు నామాటవిని
చేతనైనచో భరతునకుఁ బట్టముకట్టించుకొమ్ము.

కైక—(తనలో) ఈమంధర యెప్పుడు నాయభివృద్ధినిఁ గోరు
చుండును. ఈమెచెప్పుచున్న వాక్యములు సత్యములే. (ప్రకా
శముగా) మంధరా! రాజ్యార్హుండగు రామచంద్రునివిడిచి భ
రతుని రాజుగాఁజేయుమని నేనేవిధమునదశరథునిగోరుదును. అ
ట్లుగోరుదునేని జనులెల్లరును రాముని యభిషేకమునుజూడలేక
యసూయచే నిట్లుజేసినని లోకులెల్ల నన్ను నిందింపరా! బ్ర
తికి యున్నంతకాలమే గాక, చచ్చినపిదపగూడ నన్నినింద

విడువదు. ఇందుల కేమి సేయుదును. ఏయుపాయమును దోఁచ
కున్నది.

మంథ—ఉపాయముల కేమి. నీవు నావలన నెఱుఁగఁదలఁచి యడుగుచుంటివిగాని నీకుమాత్రము దెలియదా! మున్ను శంబరునితో యుద్ధము సేయుటకు దేవలోకమునకు నీనాథుఁ డరిగినప్పుడు నీవుగూడ నాతని వెంటనరిగి యతనికి సహాయంబొనర్చినప్పు డాతఁడు నిన్ను మెచ్చి రెండువరము లిచ్చియున్నాఁడు. ఈసంగతి నీకు జ్ఞాపక మున్నదా!

కైక—ఈసంగతి నేను మఱచిపోయితిసుమా! నీ కెంతజ్ఞాపకమే!

మంథ—ఆవరములను నింతవఱకును నీవు నీనాథునియొద్ద గ్రహించి యుండలేదు. అయ్యవి యీసమయమున నక్కఱకు వచ్చును. మొదటివరంబు రాముని నరణ్యమునఁ బదునాల్గు వత్సరములు వసింపఁ బంపుమనియు, రెండవ వరమున భరతుని రాజు జేయుమనియుఁ గోరుము, సత్యవాక్పాశబద్ధుఁడై నీనాథుఁడు దీనికంగీకరించితీరును.

కైక—పొట్టివాండ్రకుఁ బుట్టెడు బుద్ధులందురు. నీ తెలివికి మెచ్చితిని (ఎదుటఁజూచి) అడుగులచప్పుడు వినవచ్చుచున్నది. నాథుండు వచ్చుచుండెఁ గాఁబోలు నీవరుగుము. ఇంక నేనా ప్రయత్నమున నుండెద.

మంథ—(నిష్క్రమించును.)

కైక—(తనలో) నేను కోపగృహము ప్రవేశించినఁగాని కార్యము ఫలింపదు.

(భూషణముల దీసి యొకమూలబడి యుండును.)

[దశరథుఁడు ప్రవేశమునఁ బాడెడిపాట]

కన్నడరాగం - టప్పా.

ప॥ యేమిా । యీ । అద్భుతము । యీభవనము కళాహీనమై
యుండ॥ యేమిా॥

అ॥ ప॥ హాయమాయగానున్న దే యిందెవ్వరుగాన రే॥ యేమిా॥
నామనోహారిణి ఆరమణీమణి
యీమాడ్కిఁ జేసి । యెందరిగెనయ్యా॥ యేమిా॥

[దశరథుఁడు—ప్రవేశము.]

దశ—(దిక్కులఁజూచి) ఏమిదీ!

తే. గీ. నన్ను వీక్షించినంతనే ♦ నవ్యమోదము
తోడ నెదురుగా నేతెంచు ♦ తోయజాక్షి
రాకయున్నదదేమి కా ♦ రణమొ నేఁడు

(తిరిగిచూచి)

మందిరంబున లేదేమి ♦ మందయాన.

(మందిరమువంకఁజూచి) సౌధమంతయు మిగుల వెలవెల బోవుచున్నది. ఒక్క పరిచారికయైనఁ గానిపింపదు. ఒకవేళ కైకపరిహాసమునకై యెచ్చటనైన డాగియున్నదేమో! అట్లైయెయుండును. (ఇటునటుజూచి) ఇదిగో! భూషణములన్నియుఁ దీసివేసియిచ్చటఁ బడియున్నది. ఈమెమోము మిగుల కోపభావమును సూచింపుచున్నది. ఇట్లలుకవహించి పరుండియుండుట కేమికారణము! నెమ్మదిగా నీమెం జేరి కోపమును బాపెదఁగాక (కైకను సమీపించి)

మ. అలుకేల న్మదిబూనెదీవెయిట నీ ♦ కాజ్ఞావిధేయుండగాఁ
గలికీ కన్నులువిచ్చి చూచినను నీ ♦ కామ్యంబు లేమేమి నో

తెలుపంగాఁదగు వాసి నెల్లనిపుడే ♪ దీర్చెన్ సనర్చన్ నమ్మీరా
పలుమాటల్ పనియేమి నాహృదయ మర్జాతాక్షి వీక్షింపుమా
తరుణీ! లెమ్ము. లెమ్ము. నీవు కోపించినచో దశరథుండొక్క నిమిష మైనఁ దాళఁగలఁడా! భార్యలందఱికన్న నిన్నుఁ బరమానురాగముసఁ జూచువానిని, తన మనోధనమంతయు నీయధీనముఁ జేసి వర్తించువానిని, నీకంటెఁ బ్రపంచమున నెక్కువ యేదియు లేదని తలంచువానిని, నీవిధమునఁ గోపదృష్టితోఁ జూచుట తగునా?

తే. గీ. కోపమిటుఁ బూని నాపైనఁ ♪ గోమలాంగ
భూషణంబుల వర్జించి ♪ ముసుగుదాల్చి
పట్టె కటికి నేలపయిన ♪ బవ్వళించి
తేల; యిందుకుఁగారణం ♪ బేమి చెపుమ.

[కైక దశరథుడు పాడెడి డైలాగ్ పాట

బెహాగ్ రాగం—ఆదితాళం.

కైక—ప॥ చాలుచాలు నాజోలినీకేల నను ముట్టకు చేయిబట్టకు॥ చాలు॥

అ॥ ప॥ నాలలాటమున వి । రించి లిఖయించిన । వ్రాతనుగూర్చి నేవిచారింపవలసెన్ । నాకుకోపమేమి

దశ—బాలా గుణజాలా యిదేల యీలీల విచారింపనేల గతమేమో త్వరగ దెలిపి నాదుమదికలత తీర్పదయదలిర్పుమా॥

కైక—(లేచి) నాథా! నన్ను ముట్టవలదు. నాకెవ్వరిపైనను గోపము లేదు. మీపైనఁగోపించుటకు మీరేమి చేసితిరి. నాకర్మఫలమిట్లున్నది. ఒకరి నననేల! ఎవరు చేసికొనినకర్మము వారనుభవింపవలయునుగదా,

దశ—తరుణీ! నీసంతాపమునకుఁ దగిన కారణము జెప్పక యిట్లుపలికిన నేనేమనఁగలవాఁడను. ఏమర్త్యులైన నీకెగ్గుసలిపిరా! అట్లు జేయుట కెవ్వరు సాహసింపరే ఒకవేళ నట్టిదేదైన నున్నచోఁ జెప్పుము. దండించి తీరెద.

తే. గీ. కోసలేశ్వరుపుత్రిక ! కోపమూని
నిన్ను దూషించెనా చెప్పు ! నిశ్చయముగ
ఆ సుమిత్ర నీయెడల నే ! మైన దూష
ణంబు సలిపెనా వినిపింపు ! నాతిమిన్న.

కైక—ఎన్నెవ్వరును దూషింపనులేదు. భూషింపనులేదు. అయినను నాకీ యనవసరప్రసంగ మెందుకు. మీదారిని మీరు పొందు పాపము మీరియ్యది కౌసల్యామందిరమని పొరబడి దారి తప్పి వచ్చినారు. మీకొఱకా కౌసల్యామహాదేవిగారు నిరీక్షించి యుందురు. ఇప్పటికే చాలప్రొద్దుబోయినది. శీఘ్రముగా దయచేయుఁడు. (ప్రక్కకుదిరిగిచూచి) ఎవరే అక్కడ పరిచారిక! మహారాజుగారికి కౌసల్యాసౌధమునకు దారిఁ జూపుము

దశ—నారీమణీ ! నేఁడు నీమాటలు క్రొత్తదారి నవలంబించినవి—

ఉ. నేరములేదు నాయెడల ! నీరజపత్రవిశాలనేత్రి; యీ
తీరున నేలవల్కెదవు ! దివ్యకృపారస ముప్పతిల్లగా
సారమతిన్ ననుంగనుము ! చల్లఁగ దెల్పుము నీదుకోర్కె నిం
పారఁగఁదీర్చు వాఁడను ద్వ ! దాత్మను సంశయమంద నేటికిన్

కైక—అమ్మో! తీర్చకేమి-పుట్టి బుద్ధియెఱిఁగి నప్పటినుండియు నా కోర్కెలన్నియుఁ దీర్చుచునే యున్నారు. ఏమియుఁ దీర్చనిచో నింతదాన నగుదునా? శ్రీరామచంద్రుని పట్టాభిషేకమహోత్సవమునుగూర్చి యావృద్ధసాధ్వియగు కౌసల్యతోడనే గుసగుసలాడవలెనా. ఆశుభవార్త నాచెవినిఁబడఁగూడదా? నాచె

వులంతటి పాపమును జేసియున్నవా ? ఆయభిషేకపువార్త
విన్న నేను చింతింతునని తలంచితిరా?

దశ — ఓ వెఱ్ఱిదానా ! ఇందు కానీకుఁ గోపము. శ్రీరామపట్టాభిషే
కము నెఱపుటకు నిన్న నే నిశ్చయించితిని. కొన్ని రాచకార్య
ముల తొందరచేతను, నభిషేకోత్సవమునకుఁ దగినప్రయత్న
ములు జేయుచుండుటచేతను నిన్న నీమందిరమునకు రాలేదు.
ఇదిగో ఇప్పుడువచ్చితిని. అంతయేకాని మఱియొండు కారణమే
మియును లేదు.

తే, గీ. చాన, రామాభిషేక సత్సమయమంచు
నీవు చేయవలసిన దెం తేనికలను
కోపముడుగుము నాపైనఁ గువలయాక్షి
రమ్ము; మాదరింపంగనన్ను రమ్ము రమ్ము.

దీనికై యింతయాగ్రహమేల! చాలుఁజాలు నీబేలతనంబు వెల్లడిఁ
జేసితివి.

కైక — అవునవును. సమయమువచ్చినప్పుడు మీరిట్లే బ్రతిమాలు
కొందురు. మీహృదయము నేనెఱుంగనా ! మధుపూరిత
విషఘటము. ఇంతవఱకును నేమోయని భావించితిని. నేఁటికి
మీహృదయము సంపూర్తిగాఁ గనుఁగొంటిని. ఏదియెట్లయిన
ను మీచిత్త మసత్యమున కాలవాలమని మాత్రము నాకుఁదె
లిసినది. పైకిమాత్రము దశరథుఁడు సత్యముదప్పఁడు" అని
జనము లనుకొనునట్లు మాత్రముసంచరింపుచుందురు. అదియే
మీదగ్గఱనున్న గొప్పగుణము.

దశ — తరుణీమణీ! నీవెప్పుడును యేదో లేనిపోని యాగ్రహముఁ గలి
గించుకొనుచుందువు. కానిచో నావలనఁ గలిగినలోపమేమి? అ
ట్టిదేదైననున్నఁ జెప్పుము. సవరించుకొందును.

కైక—లోపములకేమి! కావలసినన్ని; అన్నిటినిమించినయసత్య మొకటి మీహృదయమును నివాసముగాఁ జేసికొనియున్నది.

దశ—కేకయరాజపుత్రీ! నీవు నాచిత్తమును బరీక్షించుట కిట్లుపలుకుచుంటివిగాని నాచిత్తము నీకు మాత్రము తెలియదా! ఈదశరథుం డెప్పుడైన నసత్యమాడెనా! ఆడునా?

తే. గీ. సూర్యవంశనృపులు పరి శుద్ధచరితు
లనృతమాడరు సర్వరా జ్యంబు ధనము
పోయిననుగాని నమ్ముమీ పొలతిమిన్న
పలికెదేటికి నీరీతి భావ్యముగునె.

ప్రాణములు బోవుపట్లనైనను రవికులీనులు ధర్మముఁదప్పివర్తింపరు. ఇదిముమ్మాటికిని నిశ్చయము, నీవు మాటవరుసకన్నంత మాత్రమున నీదశరథునిహృదయమునకుఁ గళంకమువచ్చునే.

కైక—ఎవరిమట్టుకు వారసత్యమాడమని చెప్పుకొనుట సహజమేకదా

దశ—నేనెప్పుడయిన నసత్యమాడియుంటినా! ఏదియైన నొకవిషయము వ్రేలుమడఁచి చెప్పుము. నిరంతరము రాష్ట్రజనులను గన్నబిడ్డలవిధమునఁ జూచుచు, ధర్మపథముఁదప్పక రాజ్యముఁ బాలించుచున్నాఁడను. శరణుబొందినవారిని రక్షింతునని కంకణము ధరించినాఁడను. ధర్మసత్యవ్రతముల కావాసమైన రవివంశమున జన్మమందినాఁడను. అట్టినన్ననృతవాదిగాఁ బలికిన నేమందును! పోనిమ్ము అట్టిదేదో చెప్పుము.

కైక—ఆలోచించుకొన్నచో మీకే తెలియును. నేఁజెప్పనక్కఱలేదు.

దశ—(ఆలోచించి) బుద్ధిపూర్వకముగా నేనెప్పుడైన నసత్యముబలికినట్టు నాకు స్ఫురించుటలేదు.

కైక—బుద్ధిపూర్వకము గాకపోయినచో మఱచియైన జేసి యుందురా?

దశ—నాకేమియు జ్ఞాపకములేదు.

కైక—పోనిండు. నేను జ్ఞాపకము సేయుదునా?

దశ—అవశ్యము.

కైక—మున్ను మిమ్ములను దేవేంద్రుఁడు శంబరాసునితో యుద్ధము సేయుటకుఁ దనలోకమునకుఁ గొనిపోయిన సంగతియైన జ్ఞాపకమున్నదా?

దశ—అయ్యో! జ్ఞాపకములేకేమి! అప్పుడు నేను నిన్నుఁగూడ దోడ్కొనిపోయియుంటినిగాదా?

కైక—ఇఁకనేమి! ఏసంగతియు జ్ఞాపకములేనట్లుమాత్రముపలుకుచుందురు. అచ్చట తీవ్రరణమొనరించుపట్ల మీరథచక్రములు నేల దిగఁబడనున్న యవసరమున......

దశ—అవునుసుమా? ఈసంగతి జరిగి యెన్ని సంవత్సరములో యగుటచేత మఱచితిని. ఇప్పుడు జ్ఞప్తికివచ్చినది. అప్పుడు నీవు రథచక్రములు నేలఁ గ్రుంగకుండ నీసామర్థ్యముచే నెత్తినావు. అవునా?

కైక—అప్పుడు మీరు నేనొనర్చిన కార్యమునకు సంతసించి నాకు రెండు వరములిచ్చియుండుట మాత్రముమఱచిపోయినారు కాఁబోలు!

దశ—అంతకంతకు వృద్ధదశకదా వచ్చుచున్నది! ఒకవేళ మఱచియే యుందును; నీవు జ్ఞాపకము సేయవచ్చును. ఇప్పుడు నీవు చెప్పినంతనే నాకుస్ఫురించినది. నిజమే నేనునీకువరములిచ్చినమాట.

కైక—వానిని నాకుఁదీర్చియుండిరా?

దశ—లేదు.

కైక—ఎందుచేత?

దశ—నీవుకోరియుండక పోవుటచేత.

కైక—అట్లుగాదు. కైక మఱచిపోయినది; ఇంకనీవరములమాటయెత్తకూడదనియూరకుండిరి. ఇదిమీసత్యసంధతకుభంగముకాదా?

దశ—నేనీయలేదని చెప్పినచో నట్లగును.

కైక—పోనిండు. జరిగినదానికై యోచింపనేల. ఇప్పుడావరంబుల
ననుగ్రహింతురా?

దశ—తప్పకయిచ్చెదను. దీనికొఱకా నీవింత యలుకఁబూనితివి?

[దశరథుడు పాడెడిపాట.]

శింధుకమాచిరాగం-ఆదితాళం.

ప॥ ఇచ్చెదనోతరుణీ। నేనిడినవరంబులు నీమదిమెచ్చగ॥ నిచ్చె॥

అ॥ ప॥ ఇచ్చెదఁ గోరుజీవనంబైన యిచ్చెదఁ బ్రజలు మెచ్చఁగ
స్వచ్ఛమైన సూర్యవంశమందున జన్మించియనృతంబుబల్కి
మచ్చదెత్తునే। మత్కులమునకు। మచ్చదెత్తునే ముచ్చటతో॥

సీ. రమణిరోరేపు శ్రీ ఽ రామపట్టాభిషే
కమహోత్సవంబగు ఽ గాదె; దాని
నీక్షింపసకలపృ ఽ థ్వీశ్వరులరుదెంతు
రాశ్రమవాసులై ఽ నట్టిమునులు
నాశీర్వదింపంగ ఽ నతిముదంబునవచ్చె
దరు రేపు మనకు నం ఽ దఱకుమిగుల
నానందసమయంబు ఽ నందుచే నియభీ
ష్టముదీర్తు నీకేది ఽ సమ్మతంబొ

తే. గీ. విమలరత్నహారంబులో ఽ వెలకుమిగులు
చీరలో, మాడలో; మణి ఽ శ్రేణియో; హ
యంబులో నేన్గులో మేల్ ర ఽ థంబులో స
తీనివహమో; మరేమియో; ఽ తెలుపుమబల.

కైక—నాథా! మీరు మాటకుమాత్రమిట్లు పలుకుచుంటిరిగాని నిజ
ముగా మీరు నాకిప్పుడు వరముల ననుగ్రహింతురా!

దశ — అందులకు సందేహమేమున్నది! పోనిమ్ము. నేనెప్పుడైన వరంబులనీయనని చెప్పియుంటినా!

కైక — అందులకు నేనన లేదు. అడిగినతరువాత నీయనని పలుకుదురేమోయని నామనంబున సంశయంబు గలుగుచున్నది.

దశ — నీవు సంశయింపఁబనిలేదు.

తే. గీ. సప్తవారాశులింక నా ♦ జలజహితుఁడు
చల్లఁబడినఁ బ్రాణముబోవు ♦ సమయమందు
నైన; నాఁడుమది యనృతం ♦ బాడదటివ
వేయునేఁటికిఁ గోరుమ ♦ భీష్టమేదొ.

ఈతఁడెప్పుడును నొక్కమాటమీఁదనే వర్తించునని యెఱుంగుము.

కైక — మీమాటమీఁద నాకునమ్మకము లేదు. కావుననిన్నిసార్లు అడుగుచున్నాను. మీరు నాకిప్పుడు వరములిచ్చు విషయములో బాగుగనాలోచించుకొని మాటనొసఁగుఁడు. తరువాత విచారించిన లాభముండదు. నన్నునిందించినఁ బ్రయోజనముండదు. చెప్పవలసిన సంగతులు ముందుగనే చెప్పుచున్నాను.

దశ — (తనలో) ఈకాంత వరములంగూర్చి యిన్నిసారులు నొక్కి వక్కాణించుచున్నందుకుఁ గారణము నూహింపఁజాలకయున్నాను. ఈమెయేమికోరునో కూడ దెలియకున్నది.

ఉ. ఇంతి! వృథాచలంబు వహి ♦ యింపుచుఁ గోసలరాజపుత్రికన్
బంతముతోడ దాసిగను ♦ బాగుగఁ జేయుమటంచుఁ గోరునో
మంతుకునెక్కినట్టి జన ♦ మాన్యచరిత్రుల శిక్షసేయఁ గా
సంత విచారమందకను ♦ సంతసమేర్పడఁ గోరఁబోవునో.

ఏదియైనను దప్పదుగదా. ఏమోగాని నామనమొకింత కలఁతఁజెందుచున్నది. ఈవరములమాట యీమె కిప్పుడే యేలజ్ఞప్తికి రావలయు!

కానిమ్ము (ప్రకాశముగా) ఓ కేకయరాజతనయా! నీశంకలు మాని కోరఁదలంచిన దేదో కోరుము. అనవసరమైన యూహాలు గల్పించుకొనకుము.

కైక—వరములిచ్చుటకు సంసిద్ధులై యుంటిరా!

దశ—పదిసారు లేల యడిగెదవు. దీనికిఁగావలసినఁ బ్రియత్నములే మున్నవి? నీవుకోరుటయు, నేనిచ్చుటయేకదా, దీనికింతయాలోచనయేల?

కైక—అట్లయిన నింక నడుగుదునా?

దశ—ఇంకను సంశయమేనా!

మ. తరుణీ పల్కెద రాముసాక్షిగ నబద్ధంబేమియుఁ లేదు; నీ
వరముల్ గోరుము దీర్తు నెట్టివయినన్ బల్మాటలింకేల; నీ
వరయంగాదగునాదుమానసము; దేహంబందుప్రాణంబులీ
ధరపైరాలిన రాలనిమ్మెపుడు సత్యస్ఫూర్తిరాజిల్లెదన్.

కైక—(తనలో) ఇంకనీతఁడు తిరుగఁడు. రామునిమీఁద యొట్టు బెట్టుకొని కట్టుఁబడినాఁడు. (ప్రకాశముగా) నాథా! ఇంతగా మీరు చెప్పుచుంటిరిగాన, గోరెదను.

దశ—నిస్సందేహముగఁ గోరుము. (తనలో) భగవంతా! ఈమె కోపమూని నాకు ముప్పువాటిల్లు వరములేవియుఁ గోరకుండఁ జేయుము.

కైక—ప్రాణేశ్వరా! మీరు సత్యము నిలుపుకొనువారనియు నాగ్రహమెఱుంగని వారనియు, నాకోరికఁ దప్పక దీర్తురనియుఁ గోరుచున్నాను. ఇదిగో! వినుఁడు. శ్రీరాముఁడు బదునాల్గువత్సరంబులరణ్యంబున వసింపఁబంపుటొకటియు, భరతునిరాజుగాఁ జేయుటొకటియు, నీరెండువరంబులును ననుగ్రహింపుఁడు.

దశ—హా! (మూర్ఛిల్లి లేచి) రమణీ! నేను దశరథుఁడనేనా! నీవు కైకవేనా! ఏమి! రాముని నరణ్యములకుఁ బంపుటయా! ఈ మాటలు నిజముగా నీనోటనుండి వెలువడినవేనా! ఒకవేళ నేను కలఁగంటినా! ఈదారుణవాక్యము లేమి!

కైక—మీరుకలఁగన లేదు. మీరు దశరథులే. నేను కైకనే! మీరిచ్చెదరన్న వరంబులనే నే నిట్లుగోరితిని.

దశ—హా! కైక! నీకేమయిన మనస్సు కుదురుగా లేకపోవుట చేత నిట్లుగోరితివేమో? మరల నాలోచించుకొని కోరుము. కాకున్న నీవేమి, సుగుణశీలుఁడు, ధర్మమూర్తి, సుకుమారశరీరుఁడు, పితృమాతృభక్తితత్పరుఁడు, నగు రాముని నరణ్యములకుఁ బంపుమని కోరుటేమి?

కైక—నాధా! నేనాలోచించుకొనియే యీవరములంగోరితిని. సత్యసంధులగు మీరు వీనిఁ జెల్లింపుఁడు.

దశ—ఆలోచించుకొనియే యిట్టి వరములఁ గోరితివా! ఎంత దారుణ మెంత దారుణము!

[దశరథుఁడు పాడెడిపాట]

హిందు—ముఖారి రాగం—ఏకతాళం.

ప॥ ఎంతటిదారుణమెంతటిదారుణమే। యీదురంతకోరిక॥ యెంత॥

అ॥ ప॥ సుంతయైన కొంకుజంకులేక! స్వాంతమందునఁ యోచింపక యింతటికఠ్ఠకఠోరకోరికఁ గోరనాలుకెట్లాడెనే పాపీ సంతతమాతృభక్తితత్పరుఁడు సద్గుణుఁడు శ్రీరామచంద్రుంను కాంతారంబుల జరింపవేడుకా! కైకా ఘనపాషాణమతీ॥

యెంత॥

తే. గీ. రాజ్యపరిపాలనార్హుండు రమ్యగుణుఁడు
మాతృపితృభక్తిపరుఁడు సన్మాన్యచరితుఁ

డట్టి రాము, నడవులకు - నంపుమంచుఁ
గోరఁగాఁ జెల్లునే నీకుఁ - గుందరదన.

సీ. బాలుఁడై యుండియే - బలశౌర్యములఁ జూపి,
గాధేయు యాగంబు - గాచినాఁడు
పతిశాపవశముచేఁ - బాషాణమైనట్టి,
వనజాక్షి శాపంబుఁ - బాపినాఁడు
హరుని చాపముఁ ద్రుంచి - యఖిలరాజులు మెచ్చ
నవనిపుత్రినిఁ బెండ్లి - యాడినాఁడు
నేలఱేఁడుల నెల్ల - దూలించి మించిన
పరశురాముని భంగ - పఱచినాఁడు

తే. గీ. ముగురు తమ్ముల సమదృష్టిఁ - బ్రోచువాఁడు
నాశ్రితుల నెప్డు రక్షించి - యలరువాఁడు
వాఁడు శ్రీరామచంద్రుండు - వాఁడియగు నె
వాని వనముల కంపంగ - వారిజాక్షి.

మఱచిపోయి యిట్లు గోరితివని నేను తలంచుచున్నాను.

కైక — నాథా! ఇందులో సందియమేమియు లేదు. ఈవరంబులఁ జెల్లించి మీ సత్యమును నిలుపుకొనుఁడు.

దశ — అక్కటా! కైక! ఇట్టి దారుణపుఁ గోరికఁ గోరుటకు నీ చిత్తమెట్లు సమ్మతించినది. ఇట్టి కోరికఁ గోరుటకు నీకు బుద్ధిపుట్టినదని నేను తలంపను. నీ కెవ్వరో దుర్బోధ చేసి యుందురు. కానిచో నీ వెన్నఁడైన శ్రీరామున కెగ్గు దలంచితివా! శ్రీరాముఁడన్న నాకు భరతునికంటె నెక్కువవాఁడని నీ వప్పుడప్పుడు నాతోఁ జెప్పుచువచ్చితివే. అట్టిచో నీవు నేఁడిట్లు కోరుట వింతగా నున్నది.

తే. గీ. తల్లి కౌసల్యపై కన్న । నుల్ల మంత
ప్రబలభక్తిఁ జూపు నీ । పైన వాఁడు
వానివనవాసిగాఁ జేయ । వాంఛ యేల
గోరుమింకొక్క వరమును । గోమలాంగి.

నీకుఁ గోరుటకు వరము లే లేకపోయినవా!

కైక—నాథా! ఇందుకనే మిమ్ములను నాలోచించుకొని మాటనిమ్మని చెప్పితిని. పోనిండు. ఇప్పుడుమించినదేమున్నది. వరంబుల నీయనని చెప్పుఁడు

దశ—నన్ను సత్యమునకుఁ బాలుపడుమందువా!

కైక—దానికి నేనేమి చేయుదును?

దశ—రామవనవాసమే గాని యితరమొకవరము పలుకరాదా!

కైక—నాకదియే కావలసినది.

దశ—అక్కటా! ఎంతకఠినాత్మురాలవు శ్రీరామచంద్రుఁడు నీకేమియపకారము జేసినాఁడు. నీకు భరతుఁడన్నను రాముఁడన్నను నొక్కవిధమే కదా. అట్టిచో నాతని కెగ్గుచేసినందువలన నీవందు లాభమేమున్నది. లోకము నిందించుననియైనఁ దలంపక యిట్టి కోరికగోరితివే.

ఉ. కేకయరాజు నెంతయును । గీర్తన సేయఁగ వచ్చుగాన నీ
వేకరణిన్ జనించితివి । యిట్టిగుణంబులతోడ వానికిన్
నాకు లభించితీవు మఱి । నాదగు పూర్వపుకర్మచేత; న
య్యో కృపలేక రాఘవుని । నుగ్రవనంబుల కంపఁ గోరెదే.

ఎవరైనను నమూల్యాభరణంబుల దెమ్మనుదురు. దుకూలంబుల దెమ్మందురు. లేక మఱియేయభీష్టములైన వాంఛింతురు. అంతియేగాని యిట్టికోరికఁ గోరినవారిని నేను కనివిని యుండలేదు. ఇట్టిబుద్ధి నీకుమాత్రమే పుట్టినది.

తే. గీ. తరుణిరో యింతకోపంబు దాల్చియిట్టి
వరము గోరగ నీకు భావ్యంబుగాదు
ప్రాణమిమ్మన్న నిచ్చెద రామచంద్రు
వనములకు మాత్రమేను పంపంగఁజాల.

శ్రీరాముని బాసి నేనొక్క నిమిష కాలమైనను జీవింపఁజాలను. అతఁడే నాప్రాణము. అతఁడే నాతోడునీడ. అతఁడే నాదైవము. వేయేల! నాకీలోకమంతయు నాతనితోడనే యున్నది. కైకా! నామాట వినుము. రాముఁడు నీచేరక్షింపఁబడఁదగినవాఁడు. నీవేదికోరిననదియొసంగెద. శ్రీరామవనవాసవాంఛ మాత్రము మానుము.

కైక—నాథా! ఎందుకీసంతాపము. వరంబులు లేవనినచో నొక్క మాటతోఁ బోవునుకదా!

దశ—అయ్యో! మారామమూర్తిని రక్షింపవా! ఇంత నిర్దాక్షిణ్యమా! రాముని విడచి నేనెట్లు జీవింతును! తండ్రీ! నీకుఁ బట్టాభిషేకము జేయుదునని చెప్పిన యీనోటితో వనవాసమునకుఁ బొమ్మని మారాఘవునితో నెట్లు చెప్పుదును! కైకా! నా ప్రార్థన వినవా?

సీ. తరుణిరో నాదు ప్రార్థన మాలకింపుము
శ్రీరాముఁ డడవికిఁ జేరనేని
నాదు దేహమునఁ బ్రాణములు పోవుటనిశ్చ
యంబు కృపంబూని యతనిగావఁ
గూడుము; భరతునే వేడుగా నొనరింతు;
నీయభీష్టముదీర నిక్కముగను
నీపాదసేవలఁ జేయుచు రామచంద్రుఁ
డిందు పురంబున నుండునతివ

తే. గీ. యింతమాత్రంబు దయజూడు మితని, వేడ
రాదుగాని యిదిగో నాక రము మోడ్చి
వేడుచున్నాను రాముపైఁ బ్రేమఁజూపి
నాదు ప్రాణముల్ నిలఁబెట్టు నాతిమిన్న.

(బ్రతిమాలును)

[కైక దశరథుడు పాడెడి డైలాగ్ పాట]

బెహాగ్ రాగం—ఏకతాళము.

కైక—ప॥ యికచాలుఁనిక జాలులే । యీబ్రతిమలాడుట॥
అ॥ ప॥ సకలమెఱిగినవారు మీరుయెంతకైన తగుదురు ॥యిక॥
నేకోరినవరద్వయము । వేరేయాలోచింపక
నాకొసంగి మీసత్యముగాచుకొనుడు మాటలేల॥

దశ—ఛీ కఠినచిత్తా నీచురాల నాకొంపమంటగలపనెంచితివా
యించుక యోచింపక
నాకేలదాపురించినావే । రాకాసివే
లేకున్న । లో కైక । పూజ్యుని । రాముని అడవుల । పాల్
జేయు । మందువే
యీఖడ్గము । చేనున్నదె । ఖండించెద । పాపినీ॥

కైక—నాథా! మీరెంతకైనను దగినవారు. ఈబ్రతిమాలుట యెందుకు? ఇచ్చెదరా, నేగోరినవరములిచ్చి సత్యసంధులనిపించుకొనుఁడు. లేదేని మీయిష్టము.

దశ—హా! ఎంత పాపాత్మురాలవు. విరించి నీహృదయమును పాషాణముతో నిర్మించియుండనోపు. రవికులము మంటగల్పుటకు నీవు నాకుదాపురించితివి.

(రామునుద్దేశించి).

శా. రారా రాఘవ! నాయనా యికను నే రమ్మాయటంచున్నినున్
చేరంబిల్చి వనాళికేగఁదగురా శీఘ్రంబుగా నంచు నే
నేరీతిన్ బలుకంగలాడఁ దనయా యేమందు నిద్రానికిన్
హా! రామా! వసిఁజేరఁగాఁ జనెదె రా! మా రామ! శ్రీరాఘవా!

(మూర్ఛిల్లును.

(తెరవాలును.)

ఇది ప్రథమాంకము.



శ్రీ

# పాదుకాపట్టాభిషేకము.

## ద్వితీయాంకము.

రంగము — కైకమందిరము - దశరథుఁడు మూర్ఛమునిఁగి యుండును - కైక ప్రవేశము]

కైక — (తనలో) ఈతఁడింకను మూర్ఛనుండి లేవలేదేమి చెప్పుమా!

[తెరలో]

మహారాజా! పట్టాభిషేకలగ్న మాసన్నమగుచుండెఁ గావున మిమ్ముఁ ద్వరగా రమ్మని వసిష్ఠులవారు చెప్పుచున్నారు.

కైక — (ప్రక్కఁ జూచి) ఓహో! సుమంత్రుఁడా యేమి! సుమంత్రా! నీ వరిగి సత్వరముగా శ్రీరామునితోఁ దండ్రియాజ్ఞగా నేను దెలిపితినని చెప్పి యిక్కడకుఁ దోడ్కొనిరమ్ము.

[తెరలో చిత్తము.]

కైక — (తనలో) శ్రీరాముఁడు వచ్చులోపుగ నీతఁడు మూర్ఛనుండి లేవఁగలఁడు.

శ్రీరామలక్ష్మణసీతలు ప్రవేశము.

శ్రీరా — (లక్ష్మణునింజూచి) తమ్ముఁడా! తండ్రిగారియాజ్ఞగా కైకమ్మగారు నన్నెందులకో పిలిచినారని సుమంత్రుఁడు చెప్పెనుగదా? ఇప్పుడు మనమామె యాశీర్వచనలాభముఁగూడఁ బడయగలుదుము — (ఇంచుకనడచి) ఏమిది! మందిరమంతయు నిశ్శబ్దము

గ నున్నది. మనరాకఁ దెలుపుటకయినఁ బరిచారకులెవ్వరును లేరే. కానిమ్ము మనమే పోవుదము—(నాల్గడుగులు వైచి) లక్ష్మణా ! తండ్రిగారింకను నిద్రించుచునే యున్నవారు. ఇంకను లేవలేదేమో కదా—(సమీపించి) ఈయన మొగము మిగుల దీనత్వము వహించియున్నది. కన్నులవెంట నీరుగూడ గారుచున్నది. ఇందులకేమి కారణమైయుండునో.-(కైకను సమీపించి) అమ్మా ! నమస్కారము.

[రాముఁడు ప్రవేశించి పాడెడి పాట]

కన్నడరాగము-ఆదితాళం

ప॥ కైకేయి తల్లీ వందనమిదె

అ॥ ప॥ గైకొని నాప్రార్థన యాలింపుమా
నీకొమరుఁడనే గానా జననీ॥ కైకే॥
యేకారణమున । మాజనకుండు
మేల్కొనకుండె । నింతవరకుహా॥ కైకే॥

తే. గీ. నన్నుఁజూచిన తోడనే యన్న ! రామ!
వచ్చితేయంచుఁ జేరంగ వచ్చు; తండ్రి
నిదురలేవంగ లేదేమి నేఁడు; దేహ
మందు నారోగ్యమికదా యమ్మ చెపుమ.

నారాక విన్నంతనే యెంతయో సంతసించుచు నామ్రొక్కుఁ గైకొని యాశీర్వదించునే ! అట్టితండ్రి యిట్లింకను నిద్రించుచున్నాఁడేమి ?

తే. గీ. తల్లిరో! నేఁడు నన్ను నీ ధరణికెల్లఁ
బట్టభద్రునిఁ జేయ భావమున నెంచెఁ
గాలమాసన్నమగుచుండెఁ గాని తండ్రి
నిదురలేవఁగ లేదేమి నిజము దెలుపు.

(పరికించి) ఈతనికన్నులవెంట బాష్పజలములు గాఱుచున్నవి. మోమునందు మిగుల దీనభావము గన్పట్టుచున్నది.

తే. గీ. తండ్రిశాసనమేయెప్డు తలనుదాల్చి
సంచరింపుదు; నట్టిచో జనకుమదికి
నాగ్రహము గల్గునట్టి కార్యంబునేది
యైనఁ జేసియుండనుగదా యమ్మచెప్పుమ.

మాతండ్రిగారి కాగ్రహమువచ్చు కార్యము నేనెన్నఁడును బుద్ధిపూర్వకముగాఁ జేసియెఱుంగను. అట్టిదేదైన నున్నచోఁ జెప్పితివేని సవరించుకొందును.

కైక—వత్సా! శ్రీరామచంద్రా! పితృభక్తియందు నీకెవ్వరును సాటిగారు. ఒకరితో నిన్నుఁబోల్చుటకు వీలులేదు. నీవెప్పుడును జనకునియెడల నవిధేయుఁడవై వర్తింపలేదు. నీవు చేయరాని కార్యమేమియుఁ జేసి యాయనకు నాగ్రహము గలిగించియుండలేదు.

శ్రీరా—అట్లయిన నేను గొంతవఱకు ధన్యుఁడనే. కాని యీయన యేదియో మనోవేదనఁ బొందినట్లున్నాఁడు. అది తెలియక పోవుటచేతఁ గడుపులోఁ జేయివెట్టి కలఁచినట్లున్నది—తల్లీ! దీనికిఁ గారణము కృపాంతరంగవై నీవు చెప్పుదువా!

కైక—ఆకారణమును నీకుఁ జెప్పలేకనే వారట్లుపండియున్నారు.

శ్రీరా—పోనిమ్ము. తల్లీ! నీవుచెప్పి నాహృదయసంతాపమును బోఁగొట్టరాదా.

కైక—అందులకుఁ గారణము చెప్పిన నీకు. సంతాపముగలుగునేమో యని సందియమందుచున్నాను. నీతండ్రిగారి యాజ్ఞననుసరించి నీవొక దుర్భరమైన కార్యమును జేయవలసియున్నది. అందులకు నీవేమందువో.

శ్రీరా—

చ. జనకుని యాజ్ఞయైన విను ॥ సంద్రమునందుననైన జొత్తు; స
జ్జనములు మెచ్చునట్లుగను ॥ సర్వధరాతలరాజ్యలక్ష్మినిన్
మనమున నెంచుకేనియును ॥ మానము బూనక వీడువాఁడ; నిం
కనుబలుకంగ నేమిటికి ॥ కాయమునైనను బాయఁగల్గుదున్.

అమ్మా! నాతండ్రికొఱకెట్టి కార్యము జేయుమన్నను జేసెదను. తండ్రి యభీష్టము దీర్పని పుత్రుని జన్మ వృథా కదా. ఇంక నీవు సంశయింపక యది యెట్టిదో చెప్పుము వినుటకు నాచిత్తము తత్తఱపడుచున్నది.

కైక—కుమారా! నీవట్టి పితృభక్తి తత్పరుండవని నే నెఱుంగుదును. మున్ను మీతండ్రిగారొకసమయమున శంబరాసురునితోఁ బోరుట కింద్రుఁడు పిలువగా దేవలోకమున కరిగినారు. ఆసమయమున నేనుఁగూడ వెంటనరిగితిని. ఆయుద్ధమున నేను మీతండ్రికి సహాయమాచరింపఁగా నాయందు గరుణించి రెండు వరంబు లిచ్చియున్నారు. వానిని నేనిప్పుడు దీర్పుమని యడిగితిని.

శ్రీరా—మాతండ్రి యందులకు నిరాకరించెనా యేమి?

కైక—లేదు లేదు. పాపము, ఇచ్చిరి.

శ్రీరా—అట్లయినఁ దండ్రికీచింత యెందుకు?

కైక—ఆవరంబులు నిన్నుఁ గూర్చియున్నవి

శ్రీరా—ఆవరంబులు నే నెఱుంగఁ దగుదునా!

కైక—ఈకథకుఁ బ్రధానపాత్రవు నీవే. నీవు వినకున్న నెట్లగును. నేఁ గోరిన వరములలో నొకటి నిన్ను బదునాల్గువర్షంబు లరణ్యంబున వసింపఁ బంపుమనియు, రెండవది భరతుని రాజుగాఁ జేయుమని గోరితిని. ఈసంగతి నీకుఁ జెప్పఁజాలక తండ్రిగారిట్లున్నారు

శ్రీరా—(నవ్వి) ఇదియా మాతండ్రిసంతాపమునకుఁ గారణము! ఇందు దండ్రి చింతింపవలసిన యవసర మేమియును లేదే.

చ. జనకుని శాసనంబు; ముని । చంద్రుల సేవలసేయుమంచు; యు
వ్వనములఁ గోపలన్నిగుల । వత్సరముల్ పదునాల్గునుండఁగాఁ
జనునఁట; తండ్రిసత్యమును । జక్కఁగఁ గావఁగ నోచినట్టి యా
తనయుని భాగ్యమేమనుదు । తల్లిరో ? దీనికి శంక యేటికిన్.

అమ్మా! నీయభీష్టముఁ దీర్చుటయుఁ దండ్రిగారి సత్యవ్రతమునుగాపాడుటయు నాకువిధియైయున్నది. ఇదినాకు మహాసంతోషమునకుఁ గారణముగాని సంతాపమునకుఁగాదు.

సీ. త్వదభీష్టముం దీర్ప । దండ్రిసత్యముగావ
వనులందుబదునాల్గు । వత్సరములు
వసియింపఁ గాఁబోదు । భరతుండుభూమికి
బట్టాభిషిక్తుఁడై । బఱఁగఁగలఁడు
తండ్రియాజ్ఞనుదాల్చి । ధరణిరాజ్యమువాసి,
వనికేఁగె శ్రీరామ । భద్రుఁడంచు
బ్రజలాడుమాటల । వలనఁగల్గెడికీర్తి
శాశ్వతంబైయుండు । క్ష్మాతలమున
తే. గీ. చాలదాయని నాకును । మేలుగూర్చు
నస్థిరంబైనభాగ్యభో । గ్యంబులేల
సంపదలవేల భవ్యరా । ష్ట్రంబులేల
తండ్రియాజ్ఞను మౌళిపైఁ । దాల్చుకన్న.

నాభాగ్యవశమున నాకీవనవాసము తటస్థించినది. ఇందుకు నీవావంతయు సంశయింపఁబనిలేదు.

కైక — నాయనా !

ఉ. పుత్రుఁడవన్న నీవె పరి । పూర్ణగుణాఢ్యుఁడవీవు సజ్జన
స్తోత్రుఁడ వెవ్వరిట్లు పరి । శుద్ధమనంబునఁ దండ్రియాజ్ఞకై

ధాత్రినిసర్వసంపదల దద్దయువీడి వనాళినుండ నే
మాత్రము సమ్మతించిరి కు మారనినున్నుతి యుంపఁ జెల్లదే.

నీవునాకుఁదనయుండవగుటం జేసి వినుతింపఁగూడదు. నీవెక్కడనున్నను శుభము కలుగుగాక ! యని సర్వదాయాశీర్వదించుచుందును. తండ్రీ! లోకమునమన్న పుత్రులందఱును బుత్రులుగారు. పుత్రశబ్దము నీయందేవర్తించుచున్నది.

లక్ష్మ—(కోపముతో) అన్నయ్యా ! ఇక్కడకుఁ దెలిసినది. ఆమె యేదియో చెప్పినది. నీవు వింటివి. రెంటికినిసరిపోయినది—ఇప్పటికి సంగతియంతయుఁ దెలిసినదిగదా ! వినవలసినదంతయు వింటిమి. ఇంకేమి కావలెను ?

చ. తనకొమరున్ నృపాలునిఁగఁ దప్పగఁజేయు వరంబులిమ్మనన్
మనమునఁ శంకఁబొందకను మానవనాథుఁడు నీయఁజెల్లునే
వనితయునిన్నుగానను ని వాసముసేయఁగ బంపనెంచునే
యనుజ! యసూయకాదె యిది యందఱుమెత్తురెయట్టిచేతకున్.

ఈమెకు మనజనకుండు వరంబులిచ్చియుండిన నుండుగాక. ఇట్టివరంబులుకోరఁదగునే. ధర్మవర్తివియు, సత్యమూర్తివియు, గురుభక్తితత్పరుండవును, నిష్కల్మష హృదయుండవును, నగునీ కపకారముసేయనెంచుట యీమెకు ధర్మమా ! దీనివలన నీమెకుఁ బ్రయోజన మేమియున్నది ? (ఇంచుక యూరకుండి) ప్రయోజనములేకేమి ? భరతుఁడురాజగుటయే ప్రయోజనమని తలంచినది.

చ. భరతుని రాజుఁ జేయుమని పార్థివు వేఁడిన వేఁడుగాక; యీ
వెరగున గాననంబులకు దివ్యచరిత్రుని నిన్నుఁబంపఁగాఁ
దరుణివరంబుగోరఁగనుధర్మమె; గోరునుగాక; తండ్రియే
సరణినొసంగె వీనిని వి చారముసేయక తెల్పు మగ్రజా.

అదియట్టుంచుము. ఎప్పుడో శంబరాసురయుద్ధము జరిగినదఁట. అప్పుడీమె యాయనకు సాయమొనర్చినదఁట. అందులకీయన వరములనిచ్చినాఁడఁట. ఈవరంబులనుగూర్చి యామెకును యాయనకును దప్ప మఱి యెవ్వరికిఁ దెలియును. ఈవరముల నొసంగుటకుఁ దప్పినచో ననృతదోషము సంభవించునఁట. నిండుపేరోలగంబుననుండి యనేకప్రజలును మునులును రాజులును జూచుచుండఁగా నిను రాజుగాఁ జేసెదనని పలికి, యిప్పుడిట్లు సేయుట యధర్మము కాదా. దీనికి నీవేమందువు? ఇదియంతయు నీకు సమ్మతముగా నుండునేమోగాని నాకుమాత్రముగాదు.

మ. భరతుండేక్రియ నేలనేలునిఁక భూ। పాలుండు నేభంగినిన్
వరముల్ కైకకొసంగు; నామె యెటు నిన్। బంపింపఁగా నెంచు భీ
కరశార్దూల నివాసభూమి కకటా। కానిమ్ము; వీక్షింతు నిన్
ధరణీపాలునిఁగా నొనర్చి యిపుడే। తథ్యంబుగా రాఘవా.

శ్రీరా — తమ్ముఁడా ? ఏమి నీవెఱ్ఱి. నీవెవ్వరిపైనఁ గోపముఁజూపెదవు.

శా. ఆకైకాసతి నీకుఁ దల్లియగుఁగా। దా! యన్నయౌఁగాదె నీ
కాకాంతామణి పుత్త్రకుండు, భరతుం। డయ్యారె యేమందు నీ
త్కాకాతుండును దండ్రియౌనుగద; నీ। శౌర్యంబు నెవ్వారిపై
లోకుల్ గాంచి హసింపఁ జూతురిదిఁక నా। లోచింపుమా లక్ష్మణా.

తే. గీ. గురుజనంబుల దూషించెఁ। గుమతియగుచు
ననుచు వాడవాడలజను। లాడునట్టి
నిందకొడిగట్టదలఁచితే। డెందమందు
చాలుచాలును కోపంబు। శాంతిగనుము.

సీ. గుణమండితుండవై। కొమరారు నీవిప్రు
పట్టభద్రుండవై। ప్రజలనెల్ల

ధర్మంబుఁదప్పక ఽ ధాత్రీశ్వరుల్ నుతి,
యింపనేలుదువని ఽ యెంచియుండ
కైకవరమ్ములకుఁ ఽ గాను రాజ్యమువాసి,
యటవీస్థలంబుల ఽ కరుగుచుండ
నీసేవకుండనై ఽ నెగడు నేనిదిచూచి
యొక్కింతయైనను ఽ నోర్వఁగలనె

తే. గీ. యొక్కరీయఁగనేల నీ ఽ కుర్విరాజ్య
పీఠముననిన్నుఁగూర్చుండఁ ఽ బెట్టువాఁడ
నడ్డమెవ్వరు వత్తురో ఽ యరసివారిఁ
గఱకుగరవాలమున నేను ఽ నఱికివైతు.

అన్నయ్యా! సంశయింపకరమ్ము. జాగుచేసినందువల్ల ప్రయోజనము లేదు.

తే. గీ. మునివసిష్ఠుండు బెట్టిన ఽ మహితలగ్న
మందె; ప్రజలెల్ల మిగులయా ఽ నందమంద
విమలసాకేతపురసింహ ఽ పీఠమందు
నిన్ను నాసీనుఁ జేసెద ఽ నిశ్చయముగ.

ఇందుల కెవ్వరడ్డమైనను వారిని నాఖడ్గంబునకు బలిగా నొసంగెద.

శ్రీరా—లక్ష్మణా! ఇంక నీకోపంబుఁజాలింపుము. నీకు నాయందు దృఢమైనభక్తియున్నదని నాకుఁదెలియును.

దశ—(మూర్ఛదెలిసి) కుమారా! లక్ష్మణా! నేను యవివేకిని. అసత్యప్రధానవక్రచేతస్కుఁడను; అజ్ఞానిని; కుటిలచిత్తుఁడను, పాపసంభవుఁడను, దుష్టచరిత్రుఁడను, దుర్మార్గుఁడను.

తే. గీ. రవికులధ్వంసమునకు నై ఽ భువినిజన్మఁ
గాంచినట్టిపాపాత్ముఁడఁ ఽ గాకయున్న

వనములకుఁ బంపుకొందునే ॥ వనితకొఱకు
కన్నకొడుకును నన్నులో ॥ కంబుదిట్ట.

తే. గీ. సంశయంబేల లక్ష్మణా ॥ సాహసుఁడవు
నీవె; పాపచరితుని న ॥ న్నిట్టిచంపి
పుణ్యమునుగట్టుకొమ్మిఁక ॥ బుణ్యమతిని
దనయువనవాసగమనంబుఁ ॥ గనులఁజూడ
కుండునట్టి భాగ్యంబునా ॥ కుండుఁగాక.

(లక్ష్మణునిదగ్గఱకుఁబోవుచున్నాఁడు.)

శ్రీరా—(తండ్రినిఁబట్టుకొని) తండ్రి!

తే. గీ. సాహసమునిట్లు సలుపంగఁ ॥ జనునెనీకుఁ
గోపమునలక్ష్మణుఁడను ప ॥ ల్కులకునలుగ
వలదు; బాల్యచాపలమునఁ ॥ బలికెఁగాక
తప్పుమన్నించిబ్రోవు ని ॥ తనయునీని.

లక్ష్మ—(దశరథుని పాదములపైఁబడి) తండ్రీ! నిన్ననిండుసభయందు శ్రీరామచంద్రపట్టాభిషేకమహోత్సవము నేఁడుజరుపుదునని చెప్పియుండి నేఁడిట్లగుటచేతను, దల్లియగు కైక యిట్టిదారుణమైన వరంబులఁ గోరియుండుటచేతను, రామచంద్రునిపైనున్న భక్తిచే నావేశింపఁబడినవాఁడనై మొదలుదెలియకయట్లువెఱ్ఱివానివలె నేనేవోమాటలఁ బ్రేలితిని. నన్నుక్షమించికృపాదృష్టి నవలోకింపుము.

దశ—(లక్ష్మణునిలేవనెత్తి) వత్సా! లెమ్ము! నీవలన నావంతయు లోపములేదు. ఈజడమతి, ఈమోహాంధుండు, ఈ పాపరతుఁడు జగంబున జీవించినను జీవింపకపోయినను నొక్కటే.

మ. వనితామోహనిబద్ధమానసుఁడనై ॥ భావింపకొక్కింత స
జ్జనమాన్యు౯ రఘురాము ఘోరవనవా ॥ సంబుం దగం జేయఁగా

బనుపఁ జూచితి నెంతక్రూరమతినో । ప్రారబ్ధమేమందురా

(రామునిఁ జూచి)

తనయా ! రాఘవ ! యేమి సేయుదునురా । ధర్మంబు యోచింపరా.

శ్రీరా.—తండ్రీ ! ఇంక నీవిచారముడుగుము. తల్లియభీష్టమును నీసత్యమును గాపాడుట నాకు విధియైయున్నది.

మ. భవదాజ్ఞన్శిరసావహించి వనిలో । వాసంబునుఁ జేయఁగా
భవుకప్రీతిని నేగువాఁడ నిపుడే । పల్మాటలింకేల నీ
భువికిన్ దల్లివచించినట్లు భరతుఁ । బృథ్వీశుఁగాఁ జేసి సౌ
ఖ్యవిధిఁ గాలము వెళ్ళదీయుమిటు నా । కైయేల చింతింపఁగన్

నన్నుఁగూర్చి నీవేల చింతించెదవు. పదునాల్గువర్షములును నరణ్యమున గడపివచ్చెదను.

తే. గీ. వలయుకోర్కెలఁదీర్చును । భరతుఁడెపుడు
నాకు మారుగ సేవించు । నవ్యభక్తి
లక్ష్మణుఁడు నిన్ను మిగులయా । హ్లాదమొసఁగఁ
గలఁడు శత్రుఘ్నుఁడింక జిం । తిలఁగ నేల.

నేనరణ్యవాసముననున్న తఱిని నేనింటలేనికొఱఁత వీరుముగ్గురును దీర్చుచుందురు.

దశ.—వత్సా ! రాఘవా ! జ్యేష్ఠుండవగు నీవుండఁగా భరతుఁడా రాజగుట ! అయ్యో ! ఎంతదారుణము.

సీ. నిను నిండుసభలోన । నిఖిలరాజన్యులు
వీక్షింపుచుండంగ । వేడ్కతోడ
రాఘవా ! రమ్ము శ్రీ । రామచంద్రా రమ్ము
రమ్మంచు నన్నుఁ జే । రంగబిలిచి
యుపవాసదీక్షను । నుర్విపుత్రికతోడ
గైకొమ్ము; రేపు నిన్ । క్ష్మాధవునిగ

జేయువాఁడనటంచుఁ జెప్పిన యీనోట
నిపుడు వనంబుల కేగుమంచుఁ

తే. గీ. బలుకుచుంటిని నానోరు పగిలిపోన
రామ! రామభద్రా! రఘు రామ! రామ!
ఎట్లుబోదువు వనభూమి కీవు; నేను
నెట్లుబ్రతుకుదు నిన్వీడి హేకుమార

శ్రీరా—తండ్రీ! నీవు పుత్రమోహముచేతనట్లుపలుకుచున్నావుగాని నీకుఁ దెలియని పరమధర్మంబు లేవి కలవు?

తే. గీ. ఇతని విడనాడి నీవెట కేగుదయ్య
నేను నిను వీఁడి యెచ్చటి కేగువాఁడ
వత్సరాల్ పదునాలుగు బటకగడివి
త్వరితగతి వచ్చెదను జింత వలదుమదిని

దశ—నాయనా! రామచంద్రా! కులవిస్తారకుండవగు నీయెడల నీకైక యెట్టి యెగ్గును సల్పుచుండెనురా! భార్యయుండఁగా వేఱొక భార్యను గైకొన్న నాకిట్టిగతిగాక మఱియెట్టిగతి సంభవించును.

తే. గీ. వనములకు రామభద్రుని బంపుమంచుఁ
బడఁతికోరఁగ హృదయంబు బగులకుండె
ధాత యియ్యది లోహంబు చేతఁజేసి
యుండనోపు; గాకున్న నెట్లుండఁగలదె.

[దశరథుడు పాడెడిపాట.]

కమాచిరాగము-అటతాళము.

ప॥ ఛీఛీ పాపీసురాత్మురాలా యింకను చావకయుంటివిగా॥

అ॥ ప॥ ఓసీ నాగేహమునకు కేవల బ్రహ్మరాక్షసివైతివిగా॥ ఛీఛీ ॥

భాసమా । సవిలాసునిఁ । సుగుణ ధాముని శ్రీరాముని
గాసిలఁ । జేయఁగ । నెంతువు । గాసిను । ఖండతుండలుగ జెం
డెదసుపుడే॥ ఛీఛీ॥

(కైకంజూచి) ఓసీ! దురాత్మురాలా! ఎట్టికోర్కెల కోరితివే. సకల సద్గుణాభరణుండగు శ్రీరాముని కెగ్గుదలంచిన నీముఖముఁ జూచినఁ బంచమహాపాతకములు సంభవించును. కీర్తిశాలియు, ధర్మసంధుఁడునునగు కేకయరాజతనూజవనియుఁ సుగుణపేటివనియుఁ దలంచి నిన్ను వివాహమాడితిని గాని యిట్టి పరమదురాత్మురాలవనియుఁ, దలగడక్రింద దాఁచువిధంబుననుండు దానవవనియు నెఱుంగనైతిని. ఛీ! నిన్నుఁ జంపినను బాపంబు సంభవింపదు.

శ్రీరా—తే. గీ. నేరమనుమాట నెఱుఁగను దూరనేల
తల్లి నీమాట్కి నీవు; సత్యంబునిలుపు
కొనుము; వనభూమికేని నేఁ జనెదివాఁడ
భరతుఁ జేయుము రాజుగాఁ బార్థివేంద్ర.

దశ—ఎంతకష్టము; ఈరాకాసియగు కైకవలన నియ్యది సంభవించినది. దీనినంతంబొందించినచో నేశ్రమయునుండదుకదా. పాపము సంభవించిన సంభవించుఁగాక.

(లక్ష్మణునిఁజూచి)

మ. వరపుత్రుని రఘురామచంద్రుని వనికిం బంపించి యామీఁద న
బ్భరతుని రాజ్యపుఁబీఠిపైని నిలిపి సౌభాగ్యంబుతో దూగఁగాఁ
జిరమోదంబున నెంచియున్న వనితం శీఘ్రంబుగాఁ గూల్తు భీ
కరఖడ్గంబిటు దెమ్ము చిత్తమున శంకంబొందకో లక్ష్మణా.

శ్రీరా—(తండ్రినిఁబట్టుకొని) తండ్రీ! ఏమి యీసాహసము. చాలు చాలు. మాబోంట్లకు బుద్ధిఁ జెప్పఁదగిన వాఁడవు. నీవే యిట్టి యకార్యము సేయనెంతువా!

దశ—తే. గీ. ఎవ్వరైనను గోరిరే ? యిట్టివరము
లేకయుండిరె కాంతలు ? శోకమూని
సవతికొడుకులు లేరె; యీ ? చానయందె
మండెగాక యిట్టిగుణంబు ? మహితచరిత.

కైక —(రాముని జూచి) కుమారా! రామచంద్రా! నన్నుఁజూచి వచ్చెదు మీతండ్రిగారి నేలవారింతురు. నన్నుఁజంపి పుణ్యముగట్టు కొననిమ్ము. నన్నుఁజంపినచో నీవు వనవాసివై యరుగనక్కఱ లేదు. భరతుని రాజుగాఁజేయనక్కఱలేదు. ఆయన యిచ్చిన వరములఁగోరుట చేత నేకదా యింత యాగ్రహామువచ్చినది. ఈ వరములఁ జెల్లింపనని పలికినచో నెవ్వరేమందురు?

శ్రీరా—జననీ! నాయందున్న ప్రేమచే నాతండు నన్నుఁడంబాయఁజాలక యట్లు పలికినాఁడు. అతనివలె నీవుగూడ తొందరపడినచో నే నేమని చెప్పుదును. నీవు సందియమంద బనిలేదు. పితృసత్య వాక్పరిపాలనార్థమై నేనరణ్యముల కరిగెదను.

దశ—అయ్యో! రామచంద్ర! నీవు వనముల కేగ నిశ్చయించితివా! హా! కుమారా! తనయులు లేరని మిగులవంతఁబొందియు లేక దేవతలకు మ్రొక్కి పెక్కుయాగములగావించి నల్వురతనయు లఁ గంటి. అందు నీవు జ్యేష్ఠుఁడవు. నాకు సర్వమును నీవేయని తలంచితిని. అట్టినీవు వనంబుల కేగినపిదప నాప్రాణంబులుం డవు.

శ్రీరా—తండ్రీ! సహజధైర్యస్వాంతుఁడవగు నీవిట్లుచింతించిన నే నే మందును. నీవుధైర్యమునుబూని నాకనుజ్ఞనిమ్ము.

సీత—(రామునిఁజూచి) ప్రాణేశ్వరా! నీవు వనముల కేగుటకు నిశ్చ యించితివా!

శ్రీరా—సతీమణీ! పితృవాక్యపరిపాలన మవశ్యము జేయవలసియున్న దికదా!

తే. గీ. ముప్పురత్తలకును నీవు ♦ భూరిభక్తి
సేవలను సేయుచుండుమిా ♦ చిగురుబోఁడి
విపినవాసము నేను వే ♦ వేగఁ గడపి
యేగుదెంచెద నగరికి ♦ నింతివినుమ.

సీత—మనోహరా! ఎట్టిమాట జెప్పితివి, నీవు వనవాసము జేయఁబోవు చుండఁగా నేను గృహంబున సర్వసౌఖ్యముల ననుభవింపుచుం దునా? ఇట్లెన్నఁడును దలంపవలదు. పతియెచ్చటనున్న సతి యు నచ్చటనే యుండవలయును. పతిచెంగటలేని సతిబ్రతుకు నిరర్థకము. నిన్నుబాసి నేనొక్కనిమేషమైనను నుండఁజాలను. కావునఁ గృపాంతరంగుఁడవై నన్నుఁగూడఁగొనిపొమ్ము.

శ్రీరా—రమణీ! నీకీవనవాసవాంఛ యేలజనించినది!

సీ. ఉద్యానవని కాదు ♦ యువిదరో చూడంగ
నతిభీతిగొల్పెడి ♦ యటవిగాని
సీత—యతిభీతిగొల్పెడి ♦ యటవియే నాకును
నుద్యానవనియగుచు ♦ నొప్పుచుండు
శ్రీరా—చేరియాలింప పి ♦ కారవంబుండదు
క్రూరమృగతతుల ♦ ఘోషగాని
సీత—క్రూరమృగతతుల ♦ ఘోషయే; ముదముతోఁ
జేరియాలించు పి ♦ కారవమగు
శ్రీరా—సరససంగీతమే ♦ జాడఁగానఁగరాదు
భయదరాక్షస మహా ♦ ర్భటమెగాని
సీత—భయదరాక్షస మహా ♦ ర్భటమె నాకునుదోఁచు
సరససంగీతర ♦ సంబుగాఁగ

శ్రీరా—కడుపారభుజియింపఁ । గల్గుభక్ష్యంబు
లమితమాకందమూ । లములెగాని

సీత—అమితమాకందమూ । లములెదోఁచునునాకు
కడుపారఁదినెడిభ । క్ష్యములుగాఁగ

తే. గీ. నాథ! భర్త చెంగటలేని । నాతిబ్రతుకు
నడవిఁగాచినవెన్నెల । వడువుగాదె
వేయునేటికిఁ బ్రాణేశు । వెంటనుండి
యతివబడెడు కష్టములు సౌ । ఖ్యములెయగును.

నాథా! నీవు నన్ను దోడ్కొనిపోనని చెప్పితివేని నాకు మరణమే శరణ్యముకాఁగలదు.

శ్రీరా—అరణ్యములందు నాతోఁ గష్టములందఁజాలవని యట్లు పలికితిని. పోనిమ్ము నీయభీష్టమెట్లో యట్లేయగుఁగాక!

దశ—ఎంతకష్టము. (కైకనుద్దేశించి)

తే. గీ. వనములకు నేగు శ్రీరామ భద్రుతోడ
నతనినెడబాయఁజాలక । యవనిపుత్రి
చనుచునున్నది నీకండ్లు । చల్లఁబడెనె
యెంతఘోరంబుగావించి । తీవుకైక.

(సీతనుజూచి) తల్లీ! సీతా!

చ. జనకునిముద్దుపుత్రివయి । సర్వసతీమణులందు సాధ్వివై
మనుకులమందు మెట్టిగుణ । మాన్యుని రామునిఁబెండ్లియాడి నా
కునుఁ గడుగూర్చుచుందనర । కోడలవై సుకుమారివై నిజే
శుని నెడఁబాయలేక పరి । శుద్ధమనంబున వెంటబోయెదే.

లక్ష్మ—(రామునిఁజూచి) అన్నయ్యా! రామచంద్రా! నీవును సీతయు మీదారిమీరు జూచుకొనిరి.

తే. గీ. నీవు లేనిపురంబున । నేనునిల్వఁ
జాలఁ గావునభవదీయ । చరణసేవ
సేయుచును వెంట నే తెంతుఁ । జిత్తమందుఁ
గరుణవహించి గొనిపొమ్ము । కలుషరహిత.

నిన్నుఁజూడని దినమునాకు దుర్దినము నిన్నువిడనాడి నేనిచ్చటనుండఁ జాలను.

శ్రీరా—(రహస్యముగా లక్ష్మణునితో) తమ్ముఁడా! లక్ష్మణా.

తే. గీ. ఇట్టికోరిక నీకేల । పుట్టెనిపుడు
వినుము నాకంటె మిక్కిలి । ప్రేమతోడ
నరయఁగల్గునిన్ను భరతుఁ । డతనియొద్ద
నుండు నామాటదాఁటకు । మోయియనుజ.

నీవుకూడ నావెంటవచ్చితివేని భరతుఁడుమఱియొకవిధమున భావింపఁగలఁడు.

లక్ష్మ—అగ్రజా! నీవెంత చెప్పిననుసరే

తే. గీ. రామచంద్రుఁడు లేనిరా । ష్ట్రంబునందు
నిల్వనెంచునె సౌమిత్రి । నిశ్చయముగ
నన్ను నీవెంటఁగొనిపోవ । కున్న వినుము
మరణమేసుమ్ము నాకును । శరణమగును.

శ్రీరా—తమ్ముఁడా! దీనికింత కావలయునా; చాలుచాలు. కానిమ్ము నీవుకూడ నావెంటరమ్ము

దశ—హా! సీతా! లక్ష్మణా! మీరెంతయు ధన్యులు. (తన్నుద్దేశించుకొని) ఓయీ! మూఢదశరథా!

తే. గీ. సర్వరాజ్యంబువిడనాడి । జాయతోడ
తమ్ముఁడునువెంటరా నర । ణ్యమ్ములకును

నరుగుచున్నాఁడు శ్రీరాముఁ డకట, యింకఁ
బ్రాణములదాల్చి నీవును బ్రదికెదేల

(ప్రక్కనుజూచి) సుమంత్రా !

సుమం—(ప్రవేశించి) మహారాజా ! ఏమిసెలవు ?

దశ—శ్రీరామచంద్రుఁడుమదీయసత్యవాక్పరిపాలనార్థమైనిజసతీమణి వెంటరాఁ దమ్ముఁడగు సౌమిత్రితోఁగూడ గాననంబుల కేగుచున్నాఁడు. కావున సమస్తసైన్యములను, సంపదలను, రథగజహయములను నాతనివెంటఁ బంపుము రాష్ట్రజనులలో నిష్టమైనవారిని నాతనివెంటఁ బోవచ్చునని చాటఁబంపుము. సత్వరముగ నట్లు గావింపుము.

తే. గీ. సంపదలు లేక రాష్ట్రంపు జనులు లేక
కరులు లేక రథాలు మేల్ హరులు లేక
సత్వశాహీనమైన రాజ్యంబు నెట్లు
భరతుచేత నేలింమనో పడఁతి కైక
చూచువాఁడను నేను సంకోచమేల.

కైక—నాథా ! మీరట్లొనర్చినచో నాకీవరంబులేయక్కరలేదు. వీరు ముగ్వురును నాయెదుట నారవస్త్రములఁ దాల్చి యరణ్యముల కరుగవలయును.

దశ—హా ! పాపిష్టికైకా ! ఎంతకఠినాత్మురాలవు ? హా ! రామా ! రామా !

తే. గీ పట్టభద్రుని జేయగాఁ గట్టఁ బెట్టి
నట్టి పట్టుబట్టలవీడి యకటనీవు
నారబట్టలధరియించి ఘోరవనికిఁ
దాపసునిరీతిఁ జనెదవా తండ్రివిడచి.

రామ; రఘురామ ! శ్రీరామ ! రామ రామ.

(మూర్ఛిల్లును.)

శ్రీరా—(కైకం జూచి) అమ్మా! నీవెట్లు చెప్పిన నట్లు జేసెదను. నారవస్త్రములం దెప్పింపుము.

కైక—(నిష్క్రమించి వెంటనే వచ్చి నారబట్టలు ముగ్వురకునిచ్చును. శ్రీరామాదులు వానిని ధరింతురు)

శ్రీరా—(కైకంజూచి) అమ్మా ! తండ్రిగారి సత్యముగాపాడుటకును, భవదిష్టంబుదీర్చుటకును, నేనే జానకీలక్ష్మణయుతుండనై యరణ్యంబుల కరుగుచున్నాను. నీకుం దెలియని విషయము లేవియును లేవు. తండ్రిగారికి నాపైఁ బ్రేమయధికము. అతఁడు నన్నెన్నఁడును బాసియెఱుుంగఁడు. ఆ కారణమునఁ బుత్రమోహముచే నెప్పుడైన నిన్ను గఠినవాక్యములాడినచో నీవు వానిని సఱకుఁగొనక యాతనికి నాపైఁగలుగు బెంగను బోఁగొట్టి ధైర్యము జెప్పుము. తల్లీ ! నేను జెప్పవలసినదంతికన్న నేమియు లేదు. ఇదిగో నమస్కరించుచున్నాను; పోయివచ్చెదను. ఆశీర్వదించి పంపుము.—(నమస్కరించును)

కైక—వత్సా ! రాఘవా ! పితృభక్తితత్పరుఁడవగునీకెల్లెడల శుభంబగుఁగాక. నీధర్మతత్పరతయే నిన్ను రక్షించుఁగాక !

లక్ష్మ—జననీ ! అగ్రజుని వెంట నరిగి వచ్చెద.

కైక—సోదరభక్తిగల నీకు శుభంబగుఁగాక.

సీత—అత్తగారూ ! ప్రాణేశ్వరుని సేవించుచుఁ బోయివచ్చెదను.

కైక—తల్లీ ! జానకీ ! శుభమగుఁగాక.

శ్రీరా—(లక్ష్మణునిజూచి) తండ్రిగారుమూర్ఛిల్లియున్నారు. కానిమ్ము (తండ్రిచరణములకు మ్రొక్కి) తండ్రీ ! నేనరిగివచ్చెద.

దశ—హా ! రామా ! రామా !

(శ్రీరాముఁడు-సీత-లక్ష్మణుఁడు నిష్క్రమింతురు.)

కైక—(తనలో) అబ్బా! నేననుకొన్న కార్య మయినది.

దశ—(మూర్ఛనుండి లేచి) రామా! రామా! (ఇంచుకయూరకుండి) పలుకవేమి (కైకనుజూచి) ఏఁడీ నా రామచంద్రుఁడు. నా పెన్నిధానమేది! నా భాగ్యములపంటయేడి. నానోములమూటయేడి. నా దైవమేడి. ఓ రామా! మదీయ సత్యవాక్పరిపాలనార్థమై యరణ్యమునకరుగుచున్నావ? ఈదశరథుని నేమిచేసిపోవుదువు. ఇంక నేను నిన్నుఁబాసి జీవింపఁగలనా (కైకంజూచి) హా! పాపాత్మురాలా! ఎంతపని జేసితివే. నా రాముననకును నాకును నెడఁబాతివే. (ఎదుటఁజూచి) అదుగో నారాముఁడు. అదిగో సీత. అదుగో లక్ష్మణుఁడు. ఓ రామా! నేనుగూడవచ్చుచున్నాను. నిన్నుఁబాసి నేను జీవింపఁజాలను. నన్నుగూడ నీవెంటఁ గొనిపొమ్ము. ఇదిగో! వచ్చుచున్నాను.

(నిష్క్రమించును.)

కైక—ఏమిది! మహారాజు పిచ్చియెత్తినవానివలె రామునికై వీధిం బఱుగిడుచున్నాఁడు. ఎవ్వరినైన బంపెదఁగాక.

(నిష్క్రమించును)

రంగము:—(కౌసల్యామందిరము—ప్రవేశము,
కౌసల్య, సుమిత్ర.)

సుమిత్ర—అక్కా! నేఁడు శ్రీరామచంద్రపట్టాభిషేకమహోత్సవమగుననిగదా మహారాజుగారు నిన్న మనతోఁ జెప్పినారు. అదియుంగాక తన్మహోత్సవసందర్శనార్థమై కొందఱు రాజులును, బెక్కండ్రు మునీశ్వరులును గూడ వచ్చియుండిరని వినియుంటిమి. పట్టాభిషేకమహోత్సవార్థమై నగరమెల్ల నలంకరింపఁబడినదే. నిన్నటిదినమున శ్రీరాముఁడు సీతాసమేతముగాఁ బుణ్యోపవా

సదీక్షగైకొని, తెల్లవారుజామున వసిష్ఠుడు దోడ్కొనిపోవ జానకీలక్ష్మణయుతుఁడై పట్టాభిషేక మహోత్సవమండపమున కరిగియుండెనుగదా! ఈసరికి పట్టాభిషేకమై యుండునా!

కౌస—చెల్లెలా! నీవెంత వెఱ్ఱిదానవు. పట్టాభిషేకసమయమున మహారాజుగారు మనకు వార్తఁబంపకయుందురా, మనమరుగకయుందుమా! ఇంతకుముందు మోగింపఁబడుచున్న మంగళధ్వనులు గూడ నాపఁబడినవి. దీనికిఁ గారణము నేనుగూడ నూహింపఁజాలకయున్నాను. ఎందుచేతనోగాని నాహృదయము గలఁతనొందుచున్నది.

సుమిత్ర—అడుగులచప్పుడు వినవచ్చుచున్నది. ఎవ్వరో వచ్చుచున్నట్లున్నారు.

(సీతారామలక్ష్మణులు నారవసనములదాల్చి ప్రవేశింతురు)

సుమిత్ర—ఎవ్వరోయనుకొంటిని! సీతారామలక్ష్మణులే! వీరికీవేషము లేమి ?

శ్రీరా—(కౌసల్యనుసమీపించి) అమ్మా! నావందనములఁగైకొనుము.
(నమస్కరించును.)

కౌసల్య—(ఆశ్చర్యముతో)

సీ. క్షితిపాలుజేయ; వసిష్ఠుండుగట్టిన
పట్టాభిషేకపు పట్టమేది
రాజవైతివఁటంచు రహిఁదెల్పుముందుగా
దారిఁదీసెడి చోపుదారులేరి
ఉభయపార్శ్వములందు నొప్పుగానుండెడు
వందిమాగధసూతబృందమేది
నిన్నసీవు ధరించు వన్నెవన్నెలఁజిల్కు
బంగారుజరీపట్టు బట్టలేవి

తే. గీ. నారబట్టలివేల బంగారుతండ్రి
తపసివేషము నేటికి దాల్చినావు
మెడను రుద్రాక్షలెందుకు జడలివేల
కారణము జెప్పుమా ననుం గన్నకొడుక.

(సీతనుజూచి) అమ్మా! సీతమ్మతల్లీ! నీవుగూడ కొంచెము హెచ్చు తగ్గుగా నిట్టివేషమును బూనితివేమి. నాథునకనుగుణముగా నుండవలయుననియా! (లక్ష్మణునిం జూచి) లక్ష్మణా! నీవును నగ్రజునే యనుసరించితివా!

లక్ష్మ—అమ్మా! కౌసల్యామహాదేవీ! మామువ్వరచేతను నీవేషము లొకరు వేయించినారు.

కౌస—(రామునిం జూచి) తండ్రీ! రాఘవా! ఈవేషములేమి? యీవేషములు నాకుం జింతయు, వింతయుం గొలుపుచున్నవి.

తే. గీ. పట్టభద్రుండవౌదని వాక్యమిది
గురుఁడు బెట్టినలగ్నమే తెరువునరిగె
వింతవేషము లేటికి వేసినారు
కారణము జెప్పు చిత్తంబు కలఁతఁజెందె

నాయనా! రామచంద్ర! మాటలాడవేమి?

సీ. కస్తూరికా తిలకము బెట్టుమోమున
భూతియారీతిని బూసితేల
మేలైనహారము లీలించుగళమున
తులసిరుద్రాక్షల నిలిపితేల
కమ్మసంపగినూనె కమురాచు కేశముల్
మునులజడలరీతి ముడచితేల
పట్టుదుకూలము గట్టుచుందువు నార
బట్టలనిప్పుడు గట్టితేల

తే. గీ. వీరుఖండ నీవేషమె - వేయనేల
చెప్పుడీ కారణంబన్నఁ - జెప్పవేల
దీనికెల్లఁ గారణమును - దెలిపి నాదు
చిత్తము కుదుటపడునట్లు - జేయుమయ్య.

లక్ష్మ—అమ్మా! కైకమ్మగారు మాయువ్వురకును నీవేషములు వేసి వనవాసనాటక మాడుమని సెలవిచ్చినారు. తెలిసినదా తల్లీ!

సుమి—అదేమి! కుమారా! నీమాటలలో నర్థము సరిగాఁ దెలియుటలేదు.

శ్రీరా—(కౌసల్యనుజూచి) తల్లీ! ఇందులకుఁ గారణము నేను చెప్పెదను. నీవు చింతింపవలదు. మున్ను శంబరాసుర యుద్ధసమయమున మాతండ్రి కైకమ్మగారు చేసినసహాయమునకుమెచ్చి రెండు వరంబులిచ్చియున్నవారఁట. అందుచే నావరంబులామె యిప్పుడు కోరినది. అందొకటి నేను బదునాల్గువత్సరము లరణ్యమున వసింపఁబోవుటయు, రెండవది భరతునకుఁ బట్టముగట్టుమనియుఁ గోరెను.

కౌస—హా! ఎంత నిర్భాగ్యురాలను. (మూర్ఛిల్లును.)

సుమి—అయ్యో! కుమారా!

(కౌసల్య పాడెడిపాట)

హిం॥ తోడిరాగం_ ఏకతాళం.

ప॥ హా కాలమహిమ కేమని దలంతునయ్యో దైవమా॥
అ॥ ప॥ లోకమాన్యుఁడు। పావననామ్ముఁడు। నాకుమారుఁడు శ్రీరామునకు
శుభకరముగ యీరాజ్యము రేపుపట్టాభిషేక మొనరించెడితరి
ఓ కైకా నీకేయపకారంబొనరించితి మనినోర్వవైతివి॥ హా కాల॥

కౌస—(మూర్ఛ తెలిసి) హా! తనయా! రవివంశభూషణా! జ్యేష్ఠుండవు నీవుండఁగా భరతునకుఁ బట్టముగట్టుమనికోరుట కామె కెట్లు

నోరువచ్చిఁ డి. (కైకనుద్దేశించి) అయ్యో ! కైకా ! నేనుగాని నాకుమారుఁడుగాని నీకేమి యపకారము గావించియుంటిమి ! మాయెడల నీకింత యసూయ యేలకలుగవలెను? భర్త నీకు వశుఁడై యుండెనుగదా యని యిట్టికోరిక కోరుదువా ! అక్కటా! శ్రీరామచంద్రమూర్తి యెవ్వరికిని నపకారము సేయువాఁడు కాఁడే. (దశరథునుద్దేశించి) హా! మహారాజా !

తే. గీ. కైకపైనను నీకంత కరుణయున్నఁ
జీరలో రత్నతతియొయి చ్చెదరుగాక
కన్నకొడుకు నిరీతి ను గ్రాలటవులకుఁ
బంపుమనఁగానె పంపుదే పార్థివేశ.

ఏతండ్రులైనను గుమారులను నిట్లు జేసిరా.

తే. గీ. రాఘవా రేపు నిన్నును రాజుఁగాగ
నిలుపుదునఁటంచుఁ బల్కిన నీదునోట
వనములందునఁ బదునాల్గు వత్సరములు
వాసమును జేయఁ బొమ్మంచుఁ బలికితెట్లు

నాథా ! కైకకోరిక దీర్చుటయే ధర్మమని తలంచితివిగాని మఱేమియు విచారింపవైతివి.

[రాముడు పాడెడిపాట.] 14

ఫీలుహారాగం - ఏకతాళం.

ప॥ శోకిలకమ్మా । నాకొఱకుమదిని సూతమైన ॥శో॥

అ॥ ప॥ లోకంబున జనకుని సత్యంబుగా పాడుకొరకు
మీకు నేనుపుత్రుడనై పుట్టితినని యూహింపుము॥ శోకి॥
ఆ కైకమ్మనుగాని । అకల్మషుడు తండ్రినిగాని
నా కైదుఃఖముననుండి । వారిని దూషింపకమ్మా॥ శోకి॥

శ్రీరా—అమ్మా! నీవు చింతింపవలదు. ఇందు తండ్రివలనఁగాని కైక
మ్మగారివలనగాని యావంతయు దోషములేదు. సత్యవ్రత
బద్ధుఁడై నాతండ్రి యావరముల నిచ్చియున్నాఁడు. తండ్రిగారి
సత్యమును నేను గాపాడవలయును. ఈధర్మము నీకును దెలి
సియే యున్నది. నేను జానకీలక్ష్మణసమేతుఁడనుగా నరణ్యమునఁ
బదునాలువత్సరములును చరించి వచ్చెదను. ఈవిషయమున
నీవు తండ్రిగారిచేసియు నని యాగ్రహము దెప్పింపక, యాయ
నచిత్తవృత్తి ననుసరించి ప్రవర్తింపుము

తే. గీ. భవ్యగుణుఁడైన భరతుండు ॥ భక్తితోడ
నను మాఱుగ నెప్పుడు ॥ నీకు వలయు
కార్యముల దీర్చుచుండును ॥ గానమదిని
జింతయనుమాట నావంత ॥ చేర్పకమ్మ.

(సుమిత్రనుజూచి) తల్లీ! సుమిత్రాదేవి! ఈలక్ష్మణుఁడుగూడ నావెంట
వచ్చుచున్నాఁడు.

తే. గీ. వలదువలదంచు నెంతయో ॥ పలికినాఁడ
గాని వినక నావెంటరాఁ ॥ బూనినాఁడు
కొంత యేమియువినికిఁ ॥ గూర్పకుండ
నరసిరక్షించి తోడ్తెత్తు ॥ మరలనిదు.

సుమి—నాయనా! రామభద్రా! నీవెంటనున్న వీని కేకొఱంతగల్గును
నిరంతరమును నీచరణసేవతప్ప నన్యమెఱుఁగని యీతఁడు పు
ణ్యమూర్తియగుటచేత నే నీతో నరుదెంచుచున్నాఁడు.

కౌస—(రామునిజూచి) కుమారా! రాఘవా! నీవు వనంబులకుఁ
బోవుదునని చెప్పినంతనే నాప్రాణముపోవుచున్నది. నిన్నువిడిచి
నేనెట్లు జీవింపఁగల్గుదును. నాకేమిదారిఁ జూపింతువు. నన్నుఁ
గూడ నీవెంటఁగొనిపొమ్ము.

శ్రీరా—అమ్మా! నీవు పుత్రవ్యామోహమున నట్లుచింతించెదవు. నామాటవినినీవు ధైర్యస్వాంతవుగమ్మా. ఇంక మాకనుజ్ఞనిమ్మా.

కౌస—అయ్యా! తండ్రీ! నన్ను విడిచిపోగలవా?

తే. గీ. భరతున్నృపుజేయఁ గైకకు వాంఛయున్న
నట్టివరమునేమేల యడుగరాదు
వనములకునిన్నుఁ బంపఁగా వలయుననుచుఁ
గోరగానేల నాకును క్షోభగాక.

సీత—అత్తగారూ! మీరుకొంత ధైర్యమును బూనవలయును ఈరీతిని దుఃఖించినందువలనఁ బ్రయోజనమేమియు లేదు. ప్రాణేశ్వరుని వెంటనరుగుటకు నాకాజ్ఞనిండు.

కౌస—పుణ్యాత్మురాలవగు నీవు నాథుని వెంటఁ బోవుచుంటివా! రాముని వివాహమాడి యెట్టిసౌఖ్యమునో బొందుదువని నితండ్రి తలంచినాఁడు కాని యిట్లు నాథునితో నరణ్యములపాలగుదువని యెన్నఁడును దలంచియుండఁడుకదా. లోకమున గొందఱు సతులు తమపతులు నిర్ధనులుగను, దుర్బలులుగను నున్నచోఁ జులకనఁజూతురు. నివట్లుగాక నాథునివెంట ఘోరారణ్యముల కరుగుచుంటివి. సాధ్వీలోకమున నిన్నుఁ జెప్పి మఱియొక్క సతినిఁ జెప్పవలయును. తల్లీ! సీతా! శ్రీరాముఁడు నిర్ధనుఁడు గాఁడు. మహేంద్రవైభవమునందఁదగినవాఁడు. దుర్బలుఁడు నుగాఁడు. ఒక్కసారి విల్లుచేఁబూనివారిసారించి తీవ్రదృష్టితోఁ జూచెనేని మూఁడులోకములును వడఁకును. కాని కాలపాశమున నిట్లు బద్ధుఁడైనాఁడు. పితృవాక్య పరిపాలనార్ధమై యీతఁడు పదునాల్గువత్సరములును నరణ్యములఁ జరించి, వచ్చి రాజ్యశ్రీకిఁ బట్టాభిషిక్తుఁడై మహేంద్రభోగముల నందఁగలఁడు.

సుమి—(లక్ష్మణునిఁజూచి) వత్సా ! లక్ష్మణా ! రాముని వెంటఁబోవుచున్న నీపుణ్యమే పుణ్యము. నీకొక్కసంగతిఁ జెప్పవలసియున్నది, ఈజానకి పట్టిముగ్ధ; అరణ్యమంతయు రాక్షససంచారమై యుండును. రాత్రులయందుగాని పగలుగాని శ్రీరాముఁడు నిద్రబోవునప్పుడైనను వేయేల నన్ని వేళలయందును శరాసంధరుండవై యీామెను రక్షింపుచుండుము. మఱియొకసంగతి కలదు. అమ్మహారణ్యభూమియే సాకేతనగరంబుగను, నగ్రజుండైన శ్రీరాముని దశరధభూపాలునిగను, సీతాకాంతను నన్నుగను భావించి యతిజాగరూకుఁడవై మెలంగుము. అన్నివేళలయందును వీరిరువురను రక్షించుభారము నీదైయున్నది.

లక్ష్మ—శ్రీరామసేవతప్ప నాకుఁ గావలసినదేమున్నది.

శ్రీరా—(కౌసల్యనుజూచి) తల్లీ ! ఇంక మాకనుజ్ఞనిమ్ము.

కౌస—నీవు వెళ్ళుదునని పలికినంతనే నాకు దుఃఖమువచ్చుచున్న దోయి.

శ్రీరా—ఇట్టిసమయమున ధైర్యమే సహాయముసేయును.

కౌస—తండ్రీ! విచారించినను లాభములేదు. ఇదిగో! గుండె రాయిఁ జేసికొన్నాను. వత్సా ! ఇటురమ్ము.

శ్రీరా—(సమీపించును.)

కౌస—కుమారా! అఖిలదిక్కులును, సూర్యచంద్రులు, భూమ్యాకాశంబులును, సమస్త దేవతలును నిన్ను రక్షించెదరుగాక. మున్నమృతము దెచ్చుటకైయరిగిన గరుడునకు నాతనితల్లి యగు వినతామహాదేవియొసంగిన యాశీర్వచనములును రక్షలును సదా రక్షించుగాక. వనవాసము బూర్తిజేసి సుఖమైవచ్చి మాకన్నులకానందము గలిగింతువుగాక, (లక్ష్మణునిఁజూచి) నీవీలక్ష్మణుని నతిజాగరూకతతోఁ జూడవలయును. లక్ష్మణా ! నిన్ను సమస్త దేవతలును రక్షించెదరుగాక. సుఖమై యున్న

తో మరలి వత్తువుగాక. (సీతనుజూచి) అమ్మా! జానకీ! పతి వెంటనున్న నీకేకొంతయుఁ గలుగకుండుగాక. త్రిమూర్తుల భార్యలెప్పుడును నీవెన్నంటియుండి రక్షించుచుందురుగాక.

శ్రీరా—అదిగో సుమంత్రుఁడు రథము తెచ్చి వాకిట నిలిపినాఁడు. (కౌసల్యనుజూచి) అమ్మా! సెలవు. (సీతారామలక్ష్మణులు కౌసల్యా సుమిత్రలకు నమస్కరించి నిష్క్రమింతురు.)

(తెర వాలును.)

రంగము:—[సాకేతనగరమునకు వెలుపలనున్న బయలు. శ్రీరాముఁడు సీతాలక్ష్మణ సమేతముగా రథమెక్కి ప్రవేశము.

(తెరలో)

ఉ. హా రఘునందనా! రవికులాంబుధి పూర్ణశశాంక! కీర్తివి
స్తార! తపఃఫలంబ! సముదారగుణాకర! రామచంద్ర యీ
తీరున నన్నుఁ బాయుట మదిన్ దలపోయగ ధర్మమా నె; నీ
తేరును నాపుమయ్య యిదె తీవ్రరయంబున నేనువచ్చెదన్.

(శ్రీరామాదులు ప్రవేశింతురు)

శ్రీరా—(సుమంత్రునిఁ జూచి) సుమంత్రా! మాతండ్రి నన్నెడఁబాయ జాలక యతి శీఘ్రగమనమున నన్ను గలసికొనుటకు వచ్చుచుఁ దేఁపు నాపు మని కేకలిడుచున్నాఁడు. ఈసమయమున నీతఁడు మనలఁ గలసికొనినచో మనవెంటనంటి రాఁగలఁడు. కావున రథం బాతనికిఁ గనఁబడకుండఁ దోలుము.

సుమం—మంచిది. (నిష్క్రమింతురు.)

దశరథుఁడు—(పై పద్యమును జదువుచుఁ బ్రవేశించి) ఓ రామా! నేను గూడ నిన్ను గలియవచ్చుచుంటినని బలుకుచుండఁగా రథం బాపక పోవుట ధర్మమా! నీవు వనవాసముల కరిగినచో నా కేమిదిక్కు.

చం. వనజహితాన్వయాభరణ ॥ భాసురసద్గుణశీల, నిన్నుఁ గా
వనములకంపి నేనిచట ॥ బ్రాణముతో మనశక్యమౌనె; నీ
వెనుక నెవచ్చుచుంటి రథ ॥ వేగమునాపు మొకింత నేమనన్
వనములనుండువాఁడ ముని ॥ నాథులఁ గొల్చుచు నిన్నుఁ జూచుచున్

అయ్యో! ఎన్ని కేకలు వేసినను రథ మాగకయున్నది. (సుమంత్రునుద్దేశించి) ఓసుమంత్రా! నీవైనను నామాటవిని యొక్కింత రథవేగము నాపుము. శ్రీరామమూర్తి నెడఁబాసియుండఁజాలని నేను వానింగలసి యరణ్యములం దుండుటకు వచ్చుచున్నాఁడను. నీవైనను నాయందు దయవహించి రథమాపుము.

తే. గీ. సత్యగుణుఁడైన శ్రీరామ ॥ చంద్రమూర్తి
లేనిరాజ్యమేటికి నాకు ॥ లేమ లేల
భాగ్యభోగములేల; యీ ॥ ప్రాణమేల
వానివెంటనె యుండెద ॥ వనములందు.

(ఇంచుక యూరకుండి) ఈసుమంత్రుఁడుగూడ రథము నాపక యున్న వాఁడు. అదిగో! రథముగూడ చాలాదూరముపోయినది


తే. గీ. అదిగో శ్రీరామచంద్రుఁడు ॥ నదిగో పూత
చరితమైన సీతమ్మ; ల ॥ క్ష్మణుఁడు నదిగో
రథముపోవుచున్న వేగ ॥ రాముఁ గలియఁజాల
(భగవంతునుద్దేశించి) హాదైవమా నన్ను ॥ జంపరాదె.

అదిగో! రథముఁగూడ దృష్టిపథమునుండి తప్పిపోవుచున్నది. హా! రామచంద్రా! ఎంతపిలిచినను పలుకక యరిగితివా! ఇంక నేనేమిచేయుదును. నిన్ను విడిచిన నాశరీరమున మాత్రము ప్రాణములు నిలుచునా? హా! రామా! మదాజ్ఞాపరిపాలనా! నీవిషయమునఁ గైక యెంత క్రూరకర్మమాచరించెరా తండ్రీ! అదిగో రాముఁడరిగినాఁడు ఇంక నేనాత

నిం గలిసికొనఁజాలను. నాచిత్తమున నదియొక విధమగు దడ జనించుచున్నది. కన్నులు తిరుగుచున్నవి. లోకమేమియుఁ గానిపించుటలేదు. అడుగులు తడఁబడుచున్నవి. అయ్యో! నిలువఁజాలకున్నాను. నాదేహమునఁ బ్రాణములుగూడ నుండునట్లు గానిపించదు. ఇఁక నేను రామచింతనముననే బ్రతికెదను నాల్గునాళ్ళును కాలము వెళ్ళఁబుచ్చెదఁగాక.

(నిష్క్రమించును)

ఇది ద్వితీయాంకము.



శ్రీ

# పాదుకాపట్టాభిషేకము.

## తృతీయాంకము.

రంగము:—[గంగాతీరము—శ్రీరాముఁడు, సీతాలక్ష్మణ
సుమంత్రులు ప్రవేశము.]

శ్రీరా—(సుమంత్రునిఁజూచి) సుమంత్రా!

ఉ. కొడుకా! తేరును నాపరాయనుచు నాకై క్రోశించుచున్ వెంటవ
చ్చెడు నాతండ్రి యవస్థఁజూడక నినున్ శీఘ్రంబుగాఁ దేరునున్
నడుపంగాఁదగునంచుఁ జెప్పితి నహా నాతండ్రి యిద్దానికిన్
గడుదుఃఖించియెయుండుఁగాదె యకటా కష్టంబు గల్పించితిన్

అక్కటా! మాతండ్రిగారి దుఃఖమునకు నేనేకదా కారణము.

సుమం—రామచంద్రా! ఇందులకుఁ గారణము నీవెట్లగుదువు. మీ యిడుములకును, మీ తల్లి చింతకును, దండ్రిగారి వగపునకును కైకయేకదా కారణము. ఆవరములేకదా యింతకొంపతీసెను.

శ్రీరా—ఆమెనుగూర్చి మనమేమియుఁ బలుకరాదు.

తే. గీ. ఆజి నామె చేసిన సహాయమును మెచ్చి
యిచ్చినట్టి వరద్వయ మిపుడు దీర్చె
సత్యమును నిల్పుకొనఁగ నా జనకుఁడు
కైకయందున లోపంబు గలదె చెపుమ!

కైకను నిందించినచో మనకుఁ బాపముగూడ సంభవించును. అవియట్లుంచుము.

తే. గీ. తల్లికైకమ్మ కరుణచే తగద యఖిల
మునులకును నివాసమగా వన భూమితతియుఁ
బావనంబైన గంగా స్రవంతి నిపుడు
గనులపండువుగాఁ జూడఁ గలిగెమనకు.

ఇంతకన్న కావలసిన భాగ్యమేమియున్నది

సుమం—రామచంద్రా! నీహృదయము మతినిర్మలమైనది. కానిచో కైకమ్మగారివలన దోషము లేదని చెప్పుదువా. సవతిసుతుఁడవని యిట్టి యిక్కట్లు బెట్టఁదలంచెనుగాని లేనిచో నిన్ను వనవాసిఁ జేయుమని యేల వరంబు గోరవలయును. ఇంతకంటెఁ గోరుట కేమియు నామెకుఁ దోఁచలేదా. పోనిమ్ము. భరతుని రాజుగాఁ జేయుమని గోరినఁగోరుగాక, నీకీవనవాసమేల?

శ్రీరా—సుమంతా! ఇందలిరహస్యము నీవు గ్రహింపలేకపోయితివి. కైకమ్మగారు స్త్రీయయ్యును, రాజ్యతంత్రమునందు మిగుల సామర్థ్యము గలిగియున్నది. మాతండ్రి గర్భమున జనించిన నలువురిలో నేను జ్యేష్ఠుఁడనుకదా. అందుచేత నేను రాజ్యపరిపాలనార్హుండను. భరతునకుఁ బట్టము గట్టింపవలయునను కోరిక ప్రత్యేకముగనే కోరుటకొక సంశయమామె పొందియుండును, జ్యేష్ఠుండనగు నేను పురంబుననుండఁగా భరతుఁడు రాజగుట యేమని ప్రజలాడుకొందురనిగాని, భరతుని రాజ్యపరిపాలనంబున పురంబున నేనుంటినేని, రాష్ట్రజనులందఱును నా పట్టాభిషేకోత్సవమునకై యెదురుచూచుచుండుటచేత నేనేమయిన నడ్డుగలిగింతునేమోయనిగాని, తలంచి నన్నుఁగూడ వనవాసిగాఁ జేయుమని కోరియుండును. అంతియెకాని తల్లిగారికి నావంతయేని కోపము లేదు. భరతునికన్న నెక్కుడుభక్తితో నామెను సేవింతునను సంగతియామెకు సంపూర్తిగఁ దెలిసియున్న

ది. ఏదియెట్లున్నను స్వాభావిక రామణీయతతోఁ జెన్నొందు మహారణ్యావాసంబును, మునుల సేవల జేయు భాగ్యమును నామె దయవలననే మాకుఁ గలిగినదని చెప్పవచ్చును. మా కామె మహోపకారిణి.

సీత—ఆహా! ఆకాశమునఁ ద్రిమూర్తిస్వరూపుండగు భానుండు తన ప్రచండకిరణాలినిఁ బ్రసరింపఁ జేయుచున్నాఁడు.

శ్రీరా—(సీతం జూచి) రమణీమణీ !

[అరణ్య ప్రవేశమున రాముడు సీత పాడెడి డైలాగ్ పాట.] 15

బేహాగ్ రాగం - చాపుతాళం.

రాము—ప॥ పడతీ । సుకుమార । సుందరాంగీ । వలదంచు నేవచియింపగా॥

అ॥ ప॥ కడు ప్రేముడిన్ నను । వీడకన్ వెడ । లీయడవులన్ । నడచుచున్
యిడుమలు బడుచున్ । బడలిక జెందుచు । వెలవెల బారియుంటివే॥ పడతీ॥

సీత—విను ప్రాణలోల । యినకులశీలా । సకలసద్గుణాలవాలా
నను గూర్చి మీరిసు । మంతయున్ మన । మందున్ వెత । జెందకన్
మానముత్సాహము । నన్ మీరుండుడు । మనోహరా నన్ మన్నించి॥ విను॥

రామ—తే. గీ. రాజరుషియయిన జనక । రాజపుత్రి
వై దశరథుకోడల । వై నిరంకు
శంబుగా లోకమేలెడి । శక్తిగల్గు
నాకు భార్యవైయుండియు । నానిమిత్త
మకట యడవులం జరియింప । నయ్యెనీకు.

ఆవిధాత యెప్పటికేది వ్రాసిపెట్టెనో యెవ్వరికిని దెలియదుకదా. కాకున్నచో నాగరభశ్రీమంతురాలవును, సుకుమారశరీరవునగు నీకెన్నఁడైన నరణ్యావాసము గలుగునని నీవు దలంచియుంటివా ? ముందుక్షణమున నేమిసంభవించునో యెవ్వరును నెఱుఁగరుకదా.

తే. గీ. తగినసంబంధమియ్యది । తరణివంశ
శేఖరుండగు దశరథు । జ్యేష్ఠసుతుఁడు
రామచంద్రుఁడు పేరుఁడు । రమణివాని
భార్యయై కడుసౌఖ్యంబు । బడయఁగల్గు
ననుచు సంతోషమందుచు । జనకుఁడతివ
నాకు నిన్నిచ్చె గాని నీ । కీకరణిని
భర్తతోఁగూడివనినుండ । వలసివచ్చు
నంచు నెక్కింతయూహింపఁ । డయ్యెఁగాదె.

సీత—మనోహరా ! నీవు నన్నుఁగూర్చి యిట్లు పలికెదవేల !

తే. గీ. సకలసామంతరాజన్య । సంఘమెలమిఁ
గొలువ; రాజ్యంబుఁబాలింప । వలసినట్టి
నీవెరాష్ట్రంబువిడిచి యి । ట్లుగుదేర;
వలయునే నాకు సౌఖ్యంబు । లలితచరిత.

నీవు నన్ను గూర్చి చింతింపవలదు.

శ్రీరా—సీ. పరిచారికాతతి । నిరతంబుసేవింప
భాసిల్లుచుందువు । పడతిమిన్న

సీత—భర్తతోనుండిన । భయదమృగంబులె
ఘనపరిచారికా । జనములౌచు

శ్రీరా—ఉద్యానవనమందు । నొప్పుగాఁదిరుగుచుఁ
జెలగుచుందువుకదా । చిగురుబోఁడి

సీత— ప్రాణేశ్వరునితోడ । వనవాసమైనను
నుద్యానవనమౌచు । నొప్పుచుండు
శ్రీరా— మహనీయమణిమయ । మందిరంబులయందు
వసియించెదవుకదా । వారిజాక్షి
సీత— కోమలాంగుని వెంటఁ । గొండలందుండిన
మందిరంబులెయౌచు । మదికిఁదోఁచు
శ్రీరా— హంసతూలికపాన్పు । నందున శయనించి
యలరుచుండుదువుకదా । తలిరుబోఁడి
సీత— హృదయనాథునిగూడి । నేలపైఁబండిన
తల్పంబెయౌచును । దనరుచుండు
శ్రీరా— తే. గీ. అట్టిసౌఖ్యంబులను బాసి । యకట! నీవు
నన్నుగూడి యరుదెంచి । వన్నెదొరఁగి
పడగ లేనట్టి కష్టముల్ । బడుచునుండి
యెట్టులోర్వంగఁ గలుగుదు । విప్పుడబల.
సీత— తే. గీ. ప్రాణనాథునితోనుండి । పడుచున్న
కష్టమంతయుమిగుల సు । ఖంబెయగును
పతిని సేవించి వరలెడి । పడఁతికెపుడు
రమ్యగుణసాంద్ర శ్రీరఘు । రామచంద్ర.

సుమం— (తనలో) ఆహా! ఈసీతహృదయము నెంతయుఁ బొగడవలసియున్నది. తనకై విచారింపుచున్న ప్రాణేశ్వరునికెట్టివాక్యములఁ జెప్పి విచారము పోఁగొట్టుచున్నదో. అక్కటా! ఈదంపతులిట్టి కష్టములఁ బొందవలసినవారా?

(కైకనుద్దేశించి) హా! కైకా!

తే. గీ. పాపమిదియంచుఁ దలఁపక । భవ్యగుణుని
రాముని సతీయుతముగ న । రణ్యములకుఁ

బంధసాహసించితివిగా । సాహచిత్త
మెంతగా విచారింతును । స్వాంతమందు.

కీర్తిశాలియు సద్గుణమూర్తియు నగు కేకయరాజగర్భమున జనించిన నీకిట్టిగుణము లెట్లలవడెనో తెలియకున్నది. రాముఁడు నీకు సవతిసుతుఁడేయగుఁగాక. కలనైన నీకెగ్గు జేసియుండెనా? నీకెన్నఁడైన నవిధేయతఁ జూపియుండెనా? రామునకిట్టిముప్పు దెచ్చిపెట్టినందువలన నీకువచ్చులాభము, నీనెత్తినిబడు లోకనిందతప్ప మఱియొకటి కానిపించదు. (ఇంచుకయూరకుండి) ఏమిదీ! నేను కైకను దూషింపుచుంటిని. ఎఱిఁగియో యెఱుఁగకనో కైక యిట్టివరంబులు కోరినంతనే, న్యాయమార్గవిచారణుండగు దశరథుఁ డిట్లంగీకరించినాఁడు! ఆహా! కాంతామోహము కన్నకుమారునిఁగూడఁజూడనిచ్చెను కాదు కాఁబోలు. ఇట్టివరములుగాక మఱివేఱువరములు గోరుకొనుమని దశరథుఁడు కైకకు బుద్ధిఁజెప్పినచో నింతపట్టు వచ్చునా. ఏదో సత్యమని యాతఁ డుపేక్ష చేసినాఁడు. ఇప్పుడెవ్వరినేమన్న లాభమేమున్నది. ఇంతకునుఁ గొన్నాళ్ళిట్లిడుమ లరణ్యంబునఁ బడుమని యాసీతారామలక్ష్మణుల మొగంబులయందు విధాత లిఖయించినాఁడు. ఆతనివ్రాత దాటుట కెవరికినిఁ దరము కాదు కదా. కాని యొకదానికిమాత్రము నాకు దుఃఖమొదవుచున్నది.

చ. తనయులు పుట్టలేదనుచు । దైవతపూజలఁ జేసిచేసి; మేల్
తనయులనల్వురన్ సుగుణ । ధన్యులమాన్యులఁ గాంచియెప్పుడున్
గనులకురెప్పలట్లుగను । గాంచుచుఁ బెంచిన తండ్రియే కటా
వనముల కేగుఁడీయనుచుఁ । బంపెను వీరలనంచుఁ గుందెదన్.

(అందఱినిజూచి) సుకుమారశరీరులైన వీరిమొగంబు లెండఁబడుటచేత వాడి, యెండలో వైచిన తామరతూండ్లవలెనున్నవి. ఇప్పుడేవీరిట్లుండిరి. పదునాల్గువత్సరము లెట్లరణ్యములందు గాలము గడపుదురోకదా!

శ్రీరా—సుమంత్రా ! ఏవేదియో దీర్ఘాలోచనము సేయుచున్నావే ?
సుమ—తండ్రీ ! రామచంద్ర ! ఆలోచనయేమున్నది. విచారమే.
శ్రీరా—సుమంత్రా ! ఇప్పుడువిచారమేమునకు ?
సుమ—రామా ! విచారమెందులకందువా !

తే. గీ. సకలభూచక్రమేలెడు చక్రవర్తి
వాటకునుమాఱు వనభూము లందుఁదపసి
వేషమునుబూని చరియింప వెలఁదిగూడి
తమ్ముఁడును వెంటరా నట్లు దరలివచ్చి
నందులకునిట్లు రాఘవా యాత్మవగతు.

శ్రీరా—సుమంత్రా ! నీకీపిచ్చియేమి?

చం. జనకునిసత్యశాసనము సమ్మతి శీర్షమునందుదాల్చి యీ
వనములఁ గొన్నివర్షములు వాసముచేయఁగ ; భక్తిఁదమ్ముఁడుఁ
వనితయు వెంటరాఁగ నిటు వచ్చెనురాఘవుఁడంచు నెమ్మదిన్
ఘనముదమందకీకరణిఁ గాంచెద వేల విచార మక్కటా.

తే. గీ. రాముఁడిట్లు జేసెనటంచు రహింజగానఁ
గీర్తిడిండిమప్రజలు మ్రోగింతుఁగాదె
దానిచే మాకు హీనులు ధర్మపరత
శాశ్వతంబుగనుండును సాత్మతలమున.

సుమం—రామచంద్రా ! నీవంతధైర్యమును బూనఁగలవుగాని నాబోం
ట్లు బూనఁగలరా ?

తే. గీ. నీవు పురివీడి వచ్చుచో నీప్రయాణ
మెఱిఁగి; పౌరులెల్లరువచ్చి యిట్లుమమ్ముఁ
బాసిపోవుదువాయంచు వగచినపుడు
వారికీవువచించిన వాక్యసమితి
చిత్తమున నాటియున్నది శ్రీగుణాఢ్య.

శ్రీరా—సుమంత్రా! నీకు నాయందున్న వాత్సల్యమున నిట్లువక్కా-
ణించెదవు. ఏదియెట్లున్నను పితృవాక్పరిపాలనము పుత్రున కు
భయలోకములందునను కీర్తి దెచ్చునుగదా!

సుమం—రాఘవా! నీగుణము లిదివఱకే లోకమున బ్రకాశించుచు
న్నవి. సమస్త రాజ్యశ్రీసౌఖ్యములను బరిత్యజించి యడవులం
దుఁ జరించినఁగాని కీర్తిరాదని తలంచితివా యేమి?

శ్రీరా—ప్రత్యేకముగ నట్లుచేసినచోఁ గీర్తిగలుగునా? తండ్రిగారి
సత్యశాసనము బాలించుటకుఁగదా వచ్చితిని. ఇయ్యది యా
చంద్రతారకముగా నిలుచునట్టి కీర్తికిఁ గారణముగదా.

సుమం—రామా! నీ వెట్లు చెప్పినను జెప్పఁగలవు. (సీతనుజూచి) తల్లీ!
జనకరాజపుత్రి! జనకుని పూర్వపుణ్యవిశేషమున నాతనికిఁ
బుత్రివై, పుడమిరాచూలికిఁ బట్టివై, సప్తద్వీపసముద్రముద్రి
త మహీచక్రము నిరంకుశంబుగఁ బరిపాలించు దశరథచక్ర
వర్తికిఁ బెద్దకోడలవై, సకలగుణాభిరాముండగు శ్రీరామునకు
భార్యవై యుండి యింతవఱకును శుద్ధాంతసౌధమునఁ బరిచా
రికాశతంబు నిరంతరంబును భక్తిగొలువ సమస్తసౌఖ్యముల
ననుభవించుచున్న నీకీదుర్ఘటంబైన వనవాసము సంభవించెను
గదా, అమ్మా! నీస్థితికి నేనేమని వగతును!

సీత—సుమంత్రా! భగవత్సముండగు ప్రాణేశ్వరుని వెంటనుండి నేఁ
బడు కష్టములన్నియును నాకు సుఖములే యగునుసుమా! నే
నెప్పుడును గోరునది పతిని నెన్నఁడును బాసియుండకుండుటయే.

సుమం—(లక్ష్మణునిఁజూచి) తండ్రీ! లక్ష్మణా! నీవుగూడ నగ్రజుని
వెంట వచ్చితివి.

ఉ. రాముని నెంతయుం ఘనత కేరంబగు భక్తిని గొల్చుచుండి యీ
భూమిఁ జరింపుచుండెదవు కే పుణ్యుఁడ వెంతయు నీవు నిప్పుడా

రాముని బాయలేకను న | రణ్యములందునఁగూడ శ్రీరఘుస్వా
మికి సేవఁజేయఁగను | వచ్చితివెంతయు సంతసంబునన్.

నీవు మహాపుణ్యమును జేసియుండుటచే నీతనివెంట వచ్చు భాగ్యము లభించినది.

మ. వనమందెండకు వానకోర్చి మును లే | భవ్యాత్మునింజూడఁగా
ఘననిష్ఠం దపమాచరించియు వెసన్ | గానంగ లేకుందు రా
సనకాద్యుత్తమమౌనిపూజితపదా | బ్జాతుండు నాశ్రీశుఁగా
మనమందెంచి నిరంతరంబు భజియిం | పన్ నాకు నానందమా.

సుమం—లక్ష్మణా! నీవెంతయుఁ గృతార్థుఁడవు.

శ్రీరా—(అందఱినిజూచి) ప్రేయసీ! లక్ష్మణా! సుమంత్రా! అటు జూడుఁడు.

సీ. విశ్వగర్భుఁడగుచు | వెలుఁగొందు హరిపదా
బ్జములసేతు దలఁప | జన్మగ్రహము
భక్తజనోల్లాసి | పాపవినాశిని
వారణాసీపురి | వాసభూమి
పార్వతీవల్లభు | వరజటాజూట ప్రి
దేశంబు నాట్యంపు | దివ్యసీమ
స్నానమాడినయంత | సకలాఘసమితిని
బారఁదోలుటచూడఁ | బరమగుణము

తే. గీ. అట్టిపరమపావనమౌచు | నలరుగంగ
జూడుఁడీ మదికి మిగులఁ | జోద్యముగను
గనులపండువయగుచును | గ్రాలుచుండె
దాఁటఁబోదము రండిఁక | దానినిపుడు.

సుమం—(తనలో) మేము ను గంగను సమీపించినాము. ఇప్పుడే రా ముండు గంగను దాఁటుదమని చెప్పుచున్నాఁడు. ఈతనినోటి నుండి యీమాట వెలువడగానే నాప్రాణము లెగిరిపోవుచున్నవి. అయ్యో! ఇంక నన్నింతఁ డయోధ్యాపురమునకు మఱలిపొమ్మని చెప్పును గాఁబోలు!

తే. గీ. పరమపావనమూర్తులై ఽ వరలునట్టి
రాము రామాయుతముగ న ఽ రణ్యములను
వదలి యెల్లఁబోవుమ నేను ఽ భావమందు
నేమి సేయఁగఁ దోఁచ దిఁ ఽ కేమి సేతు.

(అందఱును నడచుచున్నారు.)

[గంగానదినిఁజూచి లక్ష్మణుఁడు పాడిడిపాట]

కమాచిరాగం - ఏకతాళం.

ప॥ అహాదృక్పర్వవిరాజితమగు యీనదిరా ॥
అ॥ ప॥ ఓహో వర్ణింపనలవిగాకుండెరా అహా॥
మహామహులు సర్వమునులు సదా యీసమీపమునరా
విహరించుచు కడునిష్ఠరా । ధృతివహించి తప మొనర్చి ఇష్ట
కామ్య! సిద్ధులై । ధన్యులౌదురు । అహా॥

లక్ష్మ—అగ్రజా! మనము పరమపావనమైన గంగాతరంగిణిని సమీపించినాము. ఆహా! ఈగంగాజలంబెట్లు ప్రకాశించుచున్నదో.

తే. గీ. ఎందు స్నానమాడిన యంత ఽ నెల్లమునులు
సురలును మనుజకోటియు ఽ శోభగాంతు
రట్టివిమలసలిలవారి ఽ యైనగంగఁ
గాంచఁగంటిమి కన్నుల ఽ కఱవుదీఱ.

[గుహుఁడును—సేవకుఁడును ప్రవేశము.]

సేవ—(గుహునిఁజూచి) ఇదేంటి. వేసాలేసుకొని వచ్చిన వీరెవరు ? సూస్తేనాకు మాబయమేస్తూవుంది.

గుహు—అతేంటా్రి, కొట్టారా యేంటి. యెట్టి మొగమా బయంపడ్తావు. వీరుసాలాగొప్పోరులాగున్నారో్రియ్. దగ్గరకెళ్ళి సంగతి చందర్బాలు కనుంటకనుకొందాం రారా. (రామాదులను జూచి) బాబులారా ! మీారోరు. ఈ యేసాలేమిటి. ఏఊరుదాట్టారాయేంటి బాబూ. ఈయాడమ్మోరోరు ?

సుమం—సీపాదా ! నీపేరు గుహుఁడుకాదా! వీరిని నీవెప్పుడును జూచియుండలేదా?

గుహు—బాబూ! మీాది అయోధ్యాదేకాదంటయ్యా! నువ్వు సుమంత్రయ్యవేనా. ఈరెవరో ఏం గెప్తి లేదు.

సుమం—దశరథమహారాజుగారిని వినియుంటివా !

గుహు—చరిచరి. ఆయన్నెరక్కుండా వుండాలి. ఆయన నన్నుసూస్తే పంచపానాలు విడుస్తాఁడు ఈనావలునడుపుకొన్నందుకు పన్ను కట్టడంలేదంటయ్యా.

సుమం—సరిసరి (సీతారామలక్ష్మణులను వేరువేరుగఁజూపుచు.)

**తే.** గీ. ఇతఁడు రాముఁడు దశరథు జ్యేష్ఠపుత్రుఁ
డితఁడుతమ్ముండు లక్ష్మణుం డీమెరాము
భార్య జానకి జనకభూ పాలపుత్రి
తెలియవచ్చెనె యిఁకఁ దేట తెల్లముగను.

గుహు—సాలారోజులయింది గాని బాబూ ! ఈపిల్లల పెళ్ళిళ్ళకు గుహాప్రవేశానికి నేను సారపప్పు, తేన తెచ్చి మహారాజుగారికి కాన్కట్టాను.

సుమ—ఇంకఁ జెప్పవలసిన దేమున్నది అందఱను నీవెటింగియే యుంటివి.

గుహు—(రామునిఁజూచి) బాబూ! నీవు మా ప్రభువ్వు. నీపాదాలికి దండాలు.

(మ్రొక్కుచున్నాఁడు)

శ్రీరా—గుహుఁడా! నీభక్తికి సంతసించితిని.

గుహు—దొరలు రావడం సేత మాకు సంతోసం కలిగింది. రామయ్యా బాబూ! లచ్చుమయ్యా తండ్రీ! అమ్మా సీతమ్మతల్లీ! ఎండలో వున్నారు. ఈ చెట్టునీడకు రండి.

(అందఱు వృక్షమునీడకుఁ జేరుదురు.)

గుహు—(సేవకునిఁజూచి) ఓ రేయి. నావ తెరసాప పీక్కొనిరారా. చెట్టికిం దేస్తే రామయ్యబాబు కూర్చుంటాడు.

సేవ—(నిష్క్రమించి వెంటనే గుడ్డ తెచ్చి చెట్టుక్రింద పఱచును.)

గుహు—బాబుల్లాలా! ఇంచుమీద కూకోండి.

(అందఱునుగూర్చుందురు.)

గుహు—(రామునిజూచి) నాయనా! రామయ్యతండ్రీ! ఇల్లా ఎందాకా పెయాణం పెట్టుకొన్నారు. యిల్లాటిమునుల యేసాలు యేసినారెందుకు. సీతమ్మ తల్లిని కూడా యెంటబెట్టుకొని వచ్చారెందుకు. ఆడోర్ని తీస్కొని యిలామీాబోటోరు వత్తారంటయ్యా. కూడా నౌకర్లు చాకర్లుయేం. ఓరూ లేకుండా వచ్చారు (సుమంత్రునిజూచి) సుమంతయ్యా! తెల్సినోడవు నువ్వుసెప్ప లేదంటయ్యా.

శ్రీరా—నిషాదా!

తే. గీ. తండ్రిసత్యంబుఁ బాలింపఁ దపసివేష
మూని; తమ్ముండు వెంటరాఁ బాలఁతిఁగూడ

వనములందునఁ బదునాల్గు వత్సరములు
సంచరింపఁగ భావించి సదయహృదయ.

గుహు—అదేంటినాయనా; అరణ్యాల్లో యిన్నేళ్ళుండడంయేంటి. తండ్రిగారిసత్తెం యేంటి. పాలించడంయేంటి.

సుమం—శబరుఁడా! కైకమ్మగారిని నీవు వినియుంటివికదా. దశరధ మహారాజుగారామెకుఁ బూర్వమెప్పుడో రెండువరములిచ్చియుండుటచేత వానినిప్పుడిమ్మని కోరగా రాజుగారు సమ్మతించినారు. భరతుని రాజుగాఁజేయుమనియు, రాముని బదునాల్గు వత్సరము లరణ్యమున వసింపఁబంపుమనియు కోరెను. సత్యపాశబద్ధుఁడై దశరధుఁడందుల కంగీకరించెను. ఈకారణముచే సీరాముఁడిట్లువచ్చినాఁడు. ఆతనినెడఁబాసి యుండలేక వీరిరువురును గూడావచ్చిరి.

గుహు—గొప్పగుణాలువున్న దశరధమహారాజే యిలాంటి వరాలు ఇచ్చినాడటయ్యా. మంచిపనిసేశాడు. కొడుకునడవ్వులకంపుకుంటాడా! ఆడోరిమాట అంత తియ్యగా వుంటుందికామోసు. (రామునిజూచి) రామయ్యతండ్రీ! నువ్వేంటి. అడవుల్లోవుండడానికెల్లడంయేంటి. సాలుసాలు. పుర్రానికి మర్లండి. మీాకేం బయంలేదు. నేను మానిషావపోళ్ళబలంతో మీాతోవత్తాను కైకమ్మ భరతయ్యకు ఎల్లాపట్టంకట్టుందో సూస్తాను. అతఁడు రాజ్యమెల్లాయేల్తాడో తమోసా కనుకొంటాను. పెద్దోడవు నీవుండగా భరతుడు రాజ్యమేల్తాడా! ఈమాట వోరన్నయిన్నారంటే యెగతాళి సేయరంటయ్యా! (ఇంచుకయూరకుండి) ఆలోసిస్తావెందుకు బాబూ? అయోధ్యకెల్దాంపదండి నాబలం సిద్ధంచేస్కానివస్తాను.

శ్రీరా—గుహ! నీకు నాయందున్న వర్ణనాతీతమయిన ప్రేమకు సంతసించితిని. జనకుని సత్యశాసనము పాలించుటయే నాకుఁ బరమధర్మము. సుమంత్రుఁ డిచ్చటనుండి పురంబునకు మఱలి పోఁగలఁడు. ఇప్పుడు మేమీ భాగీరథిని దాఁటి యావలకుఁబోవలెను. కావున నీవు మాయందు దయయుంచి నావ సిద్ధపఱుపుము.

గుహు—మాయయ్యా! మాతండ్రీ మారామయ్యా! నువ్వరణ్యాల్లోకి యెళ్ళుతుంటే నేను సూసి తాళగలనా! పోనీ! తండ్రీ! నువ్వు పురానికెళ్ళొద్దు మాపల్లి రాజ్యానికి నీకు పట్టంకట్తాను. మమ్మల్ని రచ్చిస్తూ మాకుదొరవై యుండు. నీసెప్పు సేతల్లో మేము వుంటాము. నువ్వుయెల్లాసెప్తే అల్లా మేము నడ్సుకొంటాము. నీకేం యిక్కడ తక్కువుండదు. నీకోసం ప్రత్యేకంగా పెద్దగుడిసె ఓటి యేయిత్తాను. నీయిష్టం వచ్చినట్లుండవచ్చును.

శ్రీరా—నిషాదవల్లభా! నీకృపకు నేనెంతయు సంతోషించితిని. రాజ్యముతోఁగాని తత్సంబంధమైన సౌఖ్యముతోఁగాని నాకేమియుఁబనిలేదు. తండ్రిగారి సత్యవాక్యము పాలించుటయే నా ప్రధానకార్యము. ఇంక నీవు మఱియొండువచియింపక నావ సిద్ధము జేయుము.

గుహు—పెభువులల్లా చెప్తే ఏమంటాను. నావ సిద్దము చేస్తాను.

(నిష్క్రమించును)

శ్రీరా—(సుమంత్రునింజూచి) సుమంత్రా! మేమన్న నీకుఁగడు ప్రేమ. మమ్ముల రథముపై నెక్కించుకొని మిగుల దూరము వచ్చితివి. ఇంక మేమిచ్చటనుండి గంగనుదాఁటి యావలకరుగుదుము. కావున నీవీప్రదేశమునుండి రథము మరలించుకొని పురంబునకరుగుము.

ఉ. మాయెడఁగల్గుప్రేమ; నను మానముగానక యింతయైన నీ
వీయెడ దేరుదోలుకొని యింతటిదూరమువచ్చినావు భూ
నాయకుఁడంపగా నిటు, మనంబున నిప్పుడు నాకు నిన్నెడం
బాయఁగఁ బుట్టదింకమిము బాయకతప్ప దిఁకేమిచెప్పుకున్.

సుమం—తండ్రీ! రామచంద్రా! నిన్నడవుల కప్పగించిపోవుటకు నా
కుఁ గాళ్ళెట్లాడును?

తే. గీ. ఎత్తి పెంచితి నిన్ను నే నెంతయైన
వలువయంతయు బురదయా భాతి జంకఁ
బెట్టుకొని చరియించితి ప్రేమమీఱ
నక్కటా! నిన్ను వీడి యె ట్లరుగఁగలను.

తండ్రీ! రామచంద్రా! వచ్చునప్పుడు మిమ్ముందఱను రథము
పైఁబెట్టుకొనివచ్చి యిప్పుడు శూన్యరథముతోఁబోయి పురంబెట్లు ప్ర
వేశింతును. రామా! నిన్నెడఁబాయఁజాలను. నాయందు కృపాంత
రంగుఁడవై నన్నుగూడ నీవెంటనుండుటకు నాజ్ఞయిమ్ము.

శ్రీరా—సుమంత్రా! నీవువిచారింపవలదు జనకుని యాజ్ఞననుసరించి
వనములందు బదునాల్గువత్సరములును గడిపివచ్చెదను. నిన్ను
విడనాడుటకు మాకును చిత్తము సమ్మతింపకున్నది. కాని విధి
యాజ్ఞ యనుల్లంఘనీయముకదా. ఇఁక నీవు చింతవీడి పురము
జేరి మాకై బెంగఁగొనియుండుతండ్రిగారికి ధైర్యము
జెప్పుము.

సుమం—చంద్రుఁడులేని రాత్రి చందమున—సంతతిలేని కుటుంబము
రీతి—దీపములేని మందిరము తెఱంగున నుండు సాకేతనగరం
బెట్లు ప్రవేశింతును!

శ్రీరా—సుమంత్రా! చింతింపక ధైర్యముగనుండుము.

తే. గంగ దాఁటితిమంచుఁ గై । కమ్మతోడ
నమ్మగా వచియింపుమీ । నెమ్మినీవు
మాకునై చింతనొందెడు । భూమికళత్రు
ధైర్యవంతునిఁ జేయుమీ । దయదలిర్ప.

మాముప్పురతల్లులకును నమస్కారములని చెప్పుము.

లక్ష్మ—సుమంత్రా! కైకమ్మగారు మాయునికింగూర్చి నమ్మనురో లేదో. గంగానదినిదాఁటి యావలకేగితిమని యామె నమ్మునట్లు చెప్పుము. మాతల్లియగుసుమిత్రాదేవితో,

తే. గీ. నీదుయాజ్ఞను మౌళిపై । నెమ్మిదాల్చి
జానకీనాయకుని పాద । సరసిజముల
భక్తితోడ సేవింపుచు । వరలుచుండు
లక్ష్మణుఁడటంచుఁ జెప్పు మా । హ్లాదమెసఁగ.

సీత—సుమంత్రా! ముప్పురత్తలకును, మామగారికిని నమస్కారములని తెలుపుము. చెల్లెండ్రకు దీవెనల నెఱిఁగింపుము.

గుహు—(ప్రవేశించి) రామయ్యతండ్రీ! నావసిద్ధము జేసినాను.

శ్రీ—ఇదిగో! వచ్చుచున్నాము. (సుమంత్రునిజూచి)

ఉ. కాననమున్ వసింపఁగను । గామినితోడను నేగిరంచునన్
మానసమందుఁ జింతిలక । మాటికి మాటికి నింక ధైర్యముం
బూనుమటంచు జెప్పు మరి । పూర్ణకృపారసమూనుచున్ సుమం
త్రా నిను నమ్మియుండెదను । దండ్రినిగూర్చి మనంబునందునన్
ఇంక నీవేగుమ. మేము పోయివచ్చెదము.

సుమం—(కన్నీరుగార్చుచు రామా! మిమ్మెడఁబాయవలసివచ్చినందులకు నాకెంతయు దుఃఖము పొంగిపొరలివచ్చుచున్నది అయినను దప్పదయ్యెను. వత్సా! రామచంద్రా!

తే. గీ. విపినవాసము గావించి వేడ్క మీరు
మరలఁ బురికేగుదెంచెడి తరికి నేను
బ్రతికియుందునో లేదో యెవ్వారికెఱుక
కరుణఁజూచుచు నొకసారి కౌఁగిలిమ్ము.

(రామునిఁ గౌఁగిలించుకొనును)

శ్రీరా—సుమంత్రా! చింతింపకుము.

(నిష్క్రమింతురు.)

సుమం—అయ్యో! వారందఱును నావ నెక్కుచున్నారు. ఇఁక నేనును నరిగెద. (నిష్క్రమించును.)

ఇది తృతీయాంకము.

శ్రీ

# పాదుకా పట్టాభిషేకము

## చతుర్థాంకము.

[కౌసల్యామందిరములో దశరథుఁడు, కౌసల్య ప్రవేశము.]

దశ——హా! రామా! రవికులరత్నదీపా! సాకేతపురరాజ్యపీఠంబున నిన్నుఁగూర్చుండఁబెట్టి నేను భగవచ్చింతనంబునఁ గాలము వెళ్లఁ బుచ్చఁదలంచఁగా నిట్లయినదికదా! అయ్యో! కైక నాకొంప యెంతతీసెనురా! పట్టభద్రునిఁ జేయుదుననిపలికిన యానోటితో కైకవరముల కారణమున సత్యవాక్పాశబద్ధుఁడనై నిన్నరణ్యములకేగుమని చెప్పితినికదా. ఇట్లరణ్యములకరుగుమని చెప్పినందులకు నీవు నాపైన నేమనియలిగితివోకదా. నీవు నాపైన నలుగుదువని నేనుతలంపను. నీవలన నావంతయేని దోషము లేదు. నీధర్మవర్తనము, నీసద్గుణములు, నీవినయబుద్ధియెవ్వరికిని రాదు. నీయెడల నింతకాఠిన్యమువహించిన కైకను నొక్కమాటయైన నెవ్వనాఁడియెఱుఁగవు. నీకు నేను విచారించుచుంటిని గాని నీపితృభక్తి లోకంబున కాదర్శకముగాఁ జేసితివి. వత్సా! రాఘవా! సీతయు లక్ష్మణుండును నీవెంట వచ్చుటంజేసి యెంతయు ధన్యులు.

కౌస——నాథా! జరిగినదానికై మీరిట్లు విచారించినందువలన లాభమేమియున్నది. మనస్సును మఱింత క్షోభపెట్టుటకేకదా.

దశ—మోహపాశబద్ధుఁడనై కైకను వివాహమాడుట రాముని ఘోరారణ్యవాసిగాఁ జేయుటకే కాఁబోలు! కాకున్న నింతకుతినకర్మము నకు నేనొడిగట్టుదునా? నా రామచంద్రునిఁ బాయుదునా! ఆకైక యింక నేవో వరంబులుగోరునని తలంచితిగాని యిట్లు నాపుట్టిముంచునంచెఱుంగనైతిని, హా! రామా! కుమారా! నీవిషయమై పట్టాభిషేకమున కెన్నియో వస్తువులఁగూర్చితినిగదరా! నీపట్టాభిషేక మొక నాటకమయ్యెనుగదా! రాఘవేంద్రా!

తే. గీ. ఎచటనున్నావు సీతయు నెట్టులుండె
నసుజుఁ డేమి సేయుచునుండె నకట నిన్ను
బాసి; ఘోరదుఃఖాబ్ధిఁ బడితినయ్య
రఘుకులాంభోధిచంద్ర శ్రీ రామచంద్ర.

కౌస—నాథా! ఏల యిట్లు శోకించెదరు, ఒకవేళ యిప్పుడు రాముని రమ్మన్నను సత్యశాసనబద్ధుఁడైనయాతఁడు రాఁడుకదా.

దశ—దేవీ!

సీ. ఇఁతకు శ్రీరాముఁ డెంతదూరముబోయి
యుండునో యెచ్చోట నుండఁగలఁడొ
మఁమంత్రియైన సుమంత్రుఁడే దారిని
రథముగొని చనెనొ రమణిసీత
యేరీతినుండెనో యారీతిగావించె
మనతండ్రియంచు లక్ష్మణుఁడునన్ను
నేభంగిదూరునో యేకిరియనుండునో
బాధలనేవిధిఁ బడుచునున్న

తే. గీ. వారొ; యెట్లుచింతనుమిగిలిఁ నారొ; యెట్టి
చెట్లచాటునకును వారు చేరినారొ

కటకటా వారి కెట్టి సంకటము దెచ్చి
పెట్టితిని నేతయు నవి వేకినగుచు.

కౌస—నాథా! ఊరడిల్లుఁడు.

[తెరలో]

అమ్మా! కౌసల్యామహాదేవి! నేను సుమంత్రుఁడను. లోనికి రావచ్చునా?

కౌస—నిరాటంకముగ.

సుమంత్రుఁడు—(ప్రవేశించి దశరథునిఁజూచి) మహారాజా!

దశ—ఏమి! సుమంత్రుఁడా! సుమంత్రా! వచ్చితివా!

తే. గీ. వంశతిలకమా శ్రీరాము భద్రునెచట
విడిచివచ్చితివయ్యా వే వేగ దెలుపు
సీత యెట్లుండె సౌమిత్రి క్షేమ మెట్లు
బాపుమీ చింత వారల వార్తఁ దెలిపి.

మా రామయ్య తండ్రి యేమిసేయుచున్నాఁడు? ఆతఁడు నాకుఁ జెప్పిన మాటలేమి. లక్ష్మణుఁడు నాపై నాగ్రహించుచుండెనా?

సుమం—మహారాజా! నీవు వారికై విచారింపవలదు. వారందఱును సేమముగనే యుండిరి. నేను వారిని గంగానది దాఁటించివచ్చితిని. శ్రీరాముఁడు మిమ్ములను దనకై దుఃఖింపవలదని చెప్పినాఁడు.

దశ—అయ్యో! మా రామభద్రుని గంగానదిని దాటించితివా; ఆతనికై నేను దుఃఖింపకుండుట యెట్లు?

కౌస—సుమంత్రా! మా రామచంద్రుఁడు నన్ను దుఃఖము దిగమ్రింగుమని యాతఁడేగినప్పుడే చెప్పినాఁడు.

సుమం—మహారాజా! నేను గృహమునకరిగి మరల వచ్చెదను.

(నిష్క్రమించును)

దశ—హా! తన్వీ! రాముని ఘోరారణ్యసంచారిగాఁ జేసితినిగదా! ఇంక నేనెట్లు జీవింపఁగలను. ఏనాఁడు రాముని బాసితినో యానాఁడే నేను మరణించినవారిలోఁ జేరితిని.

కౌస—పాపము శమించుఁగాక. ఇంతగా నేను విలపించుచున్న నేనేమని చెప్పుదును.

దశ—ఆరాముని జూడకున్న నాప్రాణములు నిలువవు. ఆతనింజూచుట తటస్థింపదు; శ్రీరామవియోగమున నేను మేనుదొఱఁగుట నిశ్చయము. ఇందు బరమరహస్యముకలదు. మున్ను నేనొకసారి సరయూతీరప్రాంతవనికి వేటకుఁబోయి సంధ్యాసమయమున నొక వృక్షముక్రింద విశ్రమించియుండఁగా, నదియొద్దున నొక మునిబాలుఁడు భాండముచే నీరుముంచుచుండెను. ఆశబ్దమును విని నేను మదగజంబనితలంచి యాతనిపై శరముప్రయోగించితిని. శరప్రహారమున నామునిబాలుఁడు కేకవేయ నేను విని ఘోరకార్యముఁ జేసితినిగదాయని విచారింపుచు సమీపించి యాతనివలన నాతనిదల్లిదండ్రుల వృత్తాంతమెఱిఁగి వారికీబాలుని మృతినెఱింగించితిని. వారు ఘోరముగ నేడ్చి నీవు పుత్రవియోగమునఁ బ్రాణములు వాయుదువని శాపమిచ్చిరి. ఇయ్యది నా కనుభవింపక తప్పదు.

కౌస—నాథా! మీరధైర్యపడవలదు.

దశ—ఇంకెక్కడి ధైర్యము. నాకీలోకమంతయు రామునిగ నున్నది. రాముఁడు లేనిచో నాకేమియును లేదు. అంతా రామమయం. ఎక్కడ జూచినను రాముఁడే. అదుగో రాముఁడు. ఇదుగో రాముఁడు. ఓరామా! రా. నీతండ్రినగునన్నుఁ గౌఁగిలించుకొనుము.

కౌస——(తనలో) ఈయనమాటలయొక్క ప్రలాపన హెచ్చిపోవుచున్నది. ఇదేమి కర్మము.

దశ——

తే. గీ. రామ! జితకామ! జగదభిరామ! రామ!
రాజవంశాబ్ధిసోమ! శ్రీరామ! రామ!
రామ! సద్గుణసాంద్ర! శ్రీరామచంద్ర!
రామ! శ్రీరామ! జయరామ! రామ! రామ!

(మూర్ఛిల్లును.)

కౌస—ఈయన మాటలాడుచునే కన్నుమూసి మూర్ఛిల్లినాడే. నాథా! నాథా! ఏమిపలుకవు? అయ్యో! నాకేమియుందోచకున్నది. సత్వరముగ వైద్యుని రావింపవలయును.

(నిష్క్రమించును.)

(తెరవాలును.)

రంగము:—[మందిరములో ప్రవేశము:—కైక, భరతుఁడు]

[భరతుఁడు ప్రవేశించి పాడెడిపాట.]

బేహాగ్ రాగం - ఏకతాళం.

పః ఓపాపీ! యెంతఘోరమొనరించితివే॥ ఓపాపీ॥

అ॥ ప॥ యీపురిన్ జనులు! ఘోరునన్ యేద్వరామునిన్ |సీతలక్ష్మణులన్ కాపురమొనరింపగ బంపితివా కారడవులకున్ కాణాచీ;ఓపాపీ॥
యీపనిన్ గోరి బలాత్కారముగ జనకునిన్ స్వర్గమంపితివా.
ఓపలుగాకీ నీపుత్రుఁడనై నేనేలను ధరఁబుట్టితినే॥

భర—హా! పాపీ! ఎంత దుష్కార్యమాచరించితివి. నీమూలమున సూర్యవంశమునకెల్ల దుర్యశము సంభవించెనే.

తే. గీ. రమ్యగుణధాము రాము నుగ్రాటవులకుఁ
బంపి సూర్యవంశంబును బాడుసేయ

భూమియందుఁ బుట్టితివి కాఁక నీ బోలునీవు
కేకయావనీంద్రునకు ను నీ కీర్తిఁ గోలుపు.

అయ్యో! ఎంతకార్యమాచరించితివి! నిన్నుఁగన్నతల్లికంటె నెక్కువ ప్రేమతోఁ జూచు శ్రీరామునకా యెగ్గు సల్పితివి. అమ్మహాత్మునకు నాయందున్న వాత్సల్యముగూడ దగ్గునట్లు జేసితివి. దీనికంతకును నేనే కారణమని యాతండెంత యాగ్రహించెనోకదా. సోదరవత్సలుఁడగు మాయన్న కరణ్యావాసముగల్పించితివా? ఛీ! దుష్టమతీ! నీముఖంబుజూచినఁ బంచమహాపాతకములు సంభవించును.

ఉ. రాముని దేవసన్నిభు నరణ్యములన్ జరియింపఁబంపె సు
త్రామనిభుండు దండ్రినిటు ప్రాణము బాయఁగఁ జేసినావుగా
గోముఖపుండరీకగతిఁ గోమలివైతివి నాకుఁ దండ్రికిన్
భూమిని నిన్ను జంపినను బొందను బాపము వేయునేటికిన్.

నీవిట్టిపరమచండాలవని తెలియక మాతండ్రి నిన్ను చేపట్టి మోసపోయెనుగదా. నిరంతరమును ధర్మముదప్పక పాలించు నాతండ్రి మృతికి నీవేకదా కారణము. రామచంద్రుఁడెంతగా చింతించెనో. ప్రాణములు బోవునట్లు నాప్రియజనకుఁడు రామునకై యెంతవిలపించెనో. ఎండకన్నను వానకన్నను నెఱుఁగక శుద్ధాంతసౌధంబులయందు వసింపుచు సౌఖ్యమందు సీతామహాదేవి కిట్టి యిక్కట్లుగల్పించితివి. అన్నగారిపదంబుల సేవింపుచు వెంటనేగు భాగ్యము లక్ష్మణునకు లభించెను. సీతారామలక్ష్మణులు లేని యీసాకేతనగరంబు నెత్తినిగట్టుకొనఁ దలంచితివా! ఎన్నడైనను నాకీరాజ్యము కావలెననిగాని, లేక యిట్టివరంబులఁ గోరుమనిగాని నేను నీకుఁ జెప్పియుంటినా? ఇట్టివగములు కోరుమని నీకెవ్వరుపదేశించిరి?

(తండ్రినుద్దేశించి భరతుడు పాడెడిపాట.)

జయంతశ్రీరాగం - టప్పా.

ప॥ హాజనకా సకలసద్గుణతిలకా॥ జనకా॥

అ॥ ప॥ యీజగతిని మముబాసి దివికేగితివా॥ జనకా॥

రాజ్యము భరతునకు పట్టాభిషేక మొనరించి
పూజ్యుని శ్రీరాముని యడవులజరియింపగ జేసిన
యీజడురాలను యేలజీవముతో నీడితివి నాలుక చీలికలు జేసి
నక్కలపాల్ జేయవైతివి॥ జనకా॥

దశరథభూపాలా! నాపైన నీవేమి యనుమానమందితివో కదా తండ్రీ! దుర్మార్గురాలగు నాతల్లివలన నీవెట్లు వంచింపఁబడితివి. అక్కటా! రామవియోగము బ్రాణములబాసి మమ్మందఱవిడచి పోయితివా! ఇట్టివరము గోరిన నాతల్లిని నీవేల యూరకొంటివి ఖడ్గమున జంపి యున్నచో బాగుండునుగదా. అవును. సత్యవ్రతుఁడవగు నీవిట్టి కార్యమేల చేయుదువు

కైక—కుమారా! శాంతివహించి నాపలుకులాలింపుము. గతించిన దాసికై నీవువిచారింపకుము. కడుపునకన్నతీపి మఱియొకటిలేదని లోకులు చెప్పుదురు. అందుచే, సవతికొడుకగు శ్రీరాముఁడు రాజయ్యెనేని నీవతనిని సేవింపవలసివచ్చుననియు, నీవురాజువైయుండగాఁ జూడవలయుననియు నిట్లుగోరితిని. నలువురిలో నన్నల్లరిబెట్టక రాజ్యమేలుకొనుము; నీవేమో రాజ్యమేలుదువను నాసచే నిట్టివరములడిగి లోకనిందకుఁ గూడ బాలయితిని.

(భరతుడు పాడెడిపాట.)

సింధుకమాచిరాగం - చాపుతాళం.

ప॥ ఈపట్టము నానెత్తిపైబెట్టుటకా యిట్టిచెట్టబుట్టించితివి॥

అ॥ క॥ ఓ పాపీ । యీపరికిటి । బిడియమునట । మఱియుకనట
యీపురి ప్రభుత్వగరిమనుగొనుమని యేనాలుకతో బల్కితివే॥

ఈ పట్టము॥

సాకీ—పరమపావనమూర్తి సాధుజనానువర్తి సర్వప్రపంచమేలద
గు శ్రీరామమూర్తి......

ఆపవిత్రచారిత్రుని పాదసేవ నాజీవన
మీభాగ్యము, యీరాజ్యము । నీతలట గట్టియేలవే॥

భర—ఛీ! పాపీ! ఇంకను సిగ్గులేక రాజ్యమేలుమని నాకు బోధించు చుంటివా! ఎంతసాహసము. మాయగ్రజుఁడగు రామభద్రుం డులేని యీరాజ్యము నేను బాలింతునా! నేనును రామచం ద్రుఁడెచ్చటనుండునో కనుగొని యాతనిచరణముల సేవింపుచు నచ్చటనే యుండెదను.

(తెరలో)

కుమారా! భరతా! నీవేల సందియమందెదవు. మీతల్లిగారు చెప్పినప్రకారము రాజ్యము బాలింపుము. నీవేలుదువనిగాదా ఆమె యింత ఘనకార్యము చేసినది.

భర—(కైకనుజూచి) కౌసల్యామహాదేవి యెట్లు పలుకుచున్నదో కంటివా! ఆమెపలుకులు నాహృదయమున శరములకంటె నెక్కువతీవ్రముగఁ దగులుచున్నవి. ఓసీ! పాపిష్ఠికైకా! నీవునా పాలింటి మృత్యుదేవతవుగానితల్లివిగావు. నీవుజంతుహింసనాచ రించు కటికవాని గర్భమునఁ బుట్టవలసిన దానవుగాని రాజకు లమునఁ బుట్టవలసిన దానవు కావు. నిన్నుఖరాసికి బలియిచ్చిన చో నిట్టిదుష్కార్యమాచరించినకాంత చచ్చెనని లోకముసం తసించును. ఈవేటున నీతలఖండించెదఁగాచుకొమ్ము. (ఒఱ నుండి ఖడ్గము దీయుచున్నాఁడు.)

శత్రు—(తొందరగాఁ బ్రవేశించి భరతుని చేయిపట్టుకొని)

(శత్రుఘ్నుఁడు ప్రవేశించి పాడెడిపాట.)

కేదారరాగం-ఏకతాళము.

ప॥ తాళుమా తాళుమా॥ । నిమనమున । శాంతమూని యాత రిన్ ॥ తాళుమా॥

అ॥ ప॥ లలితచరితభరతమనరు యాలలన తల్లిగాదుతలపకిటుల జంప నెంచితీవు మహాఅఘమగున్ ॥ తాళుమా।

తే. గీ. తాళుతాళుము సోదరా । తల్లిజంపి
పాపమేటికి గట్టుకో । భావమందు
దలఁచినాఁడవీవిధముఁ । లలితచరిత
నాతియీమెను బ్రోవుమీ । నవ్యకరుణ.

సోదరా! ఎంతసాహసము సేయనెంచితివి! ఒకవేళ యీమె యందు దోషముండిన నుండుగాక! తల్లిని జంపుదునా! ఇట్టికార్య మాచరించినపిదపఁ దలయెత్తి మెలఁగనక్కఱలేదా! చాలు. శాంత ముదాల్చుము.

భర—తమ్ముఁడా!

తే. గీ. అన్నగారికి ద్రోహంబు । నాచరించె
తండ్రిపాలిటి మృత్యువై । తనరెనీమె
నిమెఁజంపిన బాపంబు । నెంతయెన
బొందగాఁబోము మనమింకఁ । బుడమియందు.

శత్రు—ఇఁక నీకోపంబు జాలింపుము. మనకోపమబలలపైనయాచూపించుట. ఇట్టిదుష్కార్య మాచరించినచో రాముఁడు మనమొగము జూచునా. లోకము దీనింగాంచి మనపై నింద వేయదా?

[తెరలో]

ఉ. కావలెనంచుఁ గోరుకొనె । కైక ధరాతలమెల్ల నీకు సం
భావితలీల మోదమునఁ । బట్టముగట్టఁగ నింక నేల నీ

భావమునందు సందియము । పాలనసేయు మరాజకంబునై
భూవలయంబు బాఁగను । భూరిగుణాకర పుత్రిరత్నమా.

భర—(శత్రుఘ్నునిఁజూచి) తమ్ముఁడా! చూచితివా? కౌసల్యామహా దేవిగారి వాక్యములు. ఇవి వజ్రబాణమువలె హృదయమును భేదించుచున్నవి. ఏమిసేయుదును. (ప్రక్కందిరిగిచూచి) ఓ కౌసల్యామహాదేవీ! కైకగావించిన దుష్కార్యమునుగూర్చి నే నేమైన నెఱిఁగియుంటినేని బ్రహ్మహత్యాపాతకము జేసినవాఁడనగుదును. చండాలినియై యిట్టిసాహసకార్యమాచరించిననా తల్లి పలుకులువిని రాముఁడులేని యీరాజ్యము నేను బాలింతునా? తల్లీ! రామునియందున్న నాభక్తి నీవెఱిఁగియుండియు నిట్లుల పచించెదవు. జననీ! నీపాదసాక్షిగఁ బల్కుచుంటిని. నే నిదె ప్రయాణమై యున్నగారెక్కడనుందురో యక్కడ కరిగి యాయన చరణములపై వ్రాలి బ్రతిమాలుకొని, అయోధ్యకుఁ దోడి తెచ్చెదను. (శత్రుఘ్నునిఁజూచి) తమ్ముఁడా! నీవిప్పుడే గురుఁడగు వసిష్ఠునికడకరిగి, నేను రామచంద్రుని సన్నిధి కరుగుదునని చెప్పి ప్రయాణసన్నాహము సేయుము.

కైక—(తనలో) అహా! నేనీకార్య మేలయాచరించితిని. కుమారుని సంగతి దెలియక యిట్లు చేసితినే. ఈతఁడు నామాట వినలేదు; (ప్రకాశముగా) కుమారా! నావాక్యము లాలింపవా? నలువురిలో నన్ను దలయెత్తి మెలఁగనీయవా?

భర—ఇంకను సిగ్గులేక పలుకుచుంటివా? దుష్టాత్మురాలా! నీకీ పాపహేతోకపు దశెమును జేసినవారెవరు?

[తెరలో]

మంథరయని యెఱుంగుము.

భర—అవురా! మంథర యిట్టి దుర్బోధ జేసెగా!

(తెరలో) నీవువచ్చెదవనినూతిలోఁ బడఁబోవుచున్నది.
భర—ఇదేవచ్చుచున్నాను. పోనీయక పట్టుకొనుఁడు.

(నిష్క్రమించును.)

[తెరవాలును.]

రంగము:—| చిత్రకూటము:—ప్రవేశము, శ్రీరాముఁడు, సీత.|
శ్రీరా—(సీతంగాంచి)

[సీతనుగూర్చి రాముడు పాడెడిపాట.]

హిం॥ ముఖారిరాగం-ఆదితాళము.

ప॥ యీసతి బడుయిడుమల్ । నేగనజాలనహా॥ యీసతి॥
అ॥ ప॥ భాసురదివ్యభవనములందు । హంసతూలి తల్పములందు
యీసుకుమారీజరియించి తుదకీయడవులలో బడియడలవలసె
యీసతి॥
హా, సర్వే, శ్వ, రా, కృపగ, గాంచు, మా, మముగ॥

తే. గీ. ఎండకన్నెమొ వానకఁ గన్నెమొ యెఱుఁగ
నెప్పుడకట వావెంట ఁ నేగుదెంచి
పడగరానట్టి కష్టముల్ ఁ పడుచునుండఁ
జూచియెట్లోర్తు నిన్నును ఁ సుందరాంగి.

ఓ జనకరాజపుత్రీ! నీవుపడుచున్న కష్టములు చూడలేక నాగుండెలు పగిలిపోవుచున్నవి. వేనవేలు దాసీజనములు నిరంతరమును భక్తిమీా ఆసేవింప శుద్ధాంతిసౌధంబులందు వసియించు నీకు భీకరశార్దూలమృగంబుల కాకరమైన ఘోరారణ్యములందు వసించుగతి బట్టెనుగదా అయ్యయ్యో! నామూలమున నెట్టికష్టములు బడుచున్నావు. నన్ను వివాహమాడి నిరంతరమును సౌఖ్యాంబుధిందేలుదువని తలంచి నాకు నిన్నొసఁగెఁగాని నాతోడ నీవుగూడ నరణ్యములపాలగుదువని నీతం

డి్రితలంపలేదుగదా? నావెంట రావలదని యెన్నిసార్లు నొక్కి వక్కా-
ణించినను వినకవచ్చితివి. అయ్యో! నీదేహ మెట్లు శుష్కించినదో! పం
చభక్ష్య పరమాన్నములతోడను, దధిఘృతక్షీరములతోడను నను
దినంబును భుజియించునీవు కందమూలముల దినుచుంటివి.

సీత — నాథా! ఎట్లు పలుకుచుంటివి. నేను గష్టములం బడుచుంటినా? పతిచెంగటలేకుండ వేలవేలు దాసీజనంబులు బరిచర్యలు సేయుచుండ సౌధంబులయందు వసించుచుండినను బడతికి సౌఖ్యము గలుగునా? పతినిడచియున్న సతిబ్రతుకేల, ఎన్నికష్టములు ప్రాప్తించినను పతినిమాత్రమెన్నడెడంబాయక చరించు సద్గుణాఢ్యయగు యువతి యుభయలోకపూజితయగును. ప్రాణేశ్వరా! నేను శ్రమపడుచుంటినని తలంపవలదు. నేను పడుచున్న శ్రమయంతయు నాకు సౌఖ్యముగనే యున్నది. ఎన్నండును మిమ్ముల నెడంబాయకుండుటయే నాకుం గావలసినది.

శ్రీరా — రమణీ! నాయందుభక్తిచే నట్లు పలుకుదువుగాని శ్రమ సుఖమెట్లగును.

సీత — చీకటులుపోయి వెన్నెలవచ్చునట్లు కష్టసుఖములు సమముగా ననుభవింపవలయును

(శైరంగో ధ్వని)

సీత — ప్రాణేశ్వరా! ఏదియోధ్వని వినవచ్చుచున్నది. రాక్షసులెవ్వరును కారుగదా.

శ్రీరా — అయిననేమి! ఇదిగో ఖడ్గము. ఇదిగో శరము.

సీత — నీయుండనుండగా నాకేమిభయము?

శ్రీరా — (ఎదుటజూచి) ఫలార్థమైయరిగిన లక్ష్మణుడు దొన్నెలతో తొందరగా పరుగెత్తుకొని వచ్చుచున్నాడు.

[కరవాలధరుఁడైన లక్ష్మణుఁడు ప్రవేశించును]

లక్ష్మ—(వెనుకకుజూచుచుఁ గోపముతో)

మ. ధరణీరాజ్యము నెల్ల గైకొనియు స్వామిన్ దాఁబాదు నూహింపకే
కరిణీగామియు మున్ వసింపఁగన వేడ్కన్ బంపి యద్దానికిన్
బరితృప్తిన్ గనలేక రామునికిన్ భజింపఁగా నెంచితే
భరతా! రమ్ము ఖరాసిబూనితి నదే ప్రాణంబులం దీయఁగన్,

తే. గీ. సోదరుని వధియించిన సూనుకాఁడ
టంచు నిందవచ్చినను నే నందువాఁడ
పాపకృత్యము సేయ భావమున నెంచు
నీదు ప్రాణముల్ దీసెద నిక్కముగను.

ఓరీ! మహాపాతకవర్తీ! భరతా! ఏతాదృశకార్యము జేయ సాహసించితివిరా? కైకకట్టి తుచ్ఛమంత్రి ముపదేశించి, రాజ్యము స్వీకరించి శ్రీరాముని నడవులపాలుగావించి యంతట నూరకొనక నీ యనఘుని పైకి గయ్యమున కరుదెంచితివా? గురుద్రోహము గట్టుకొనఁదలఁచితివా? ఔరా! నీచమతీ! నీకిట్టి యుపదేశ మెవ్వరుచేసిరి? ఇట్టిదుర్నీతిపరుఁడవై యరుదెంచుచున్న నిన్నిప్పుడే యంతంబొందించి కైకను నపుత్రవతిగాఁ జేసెదఁగాక.

శ్రీరా—హా రామా రా! పాపము శమించుఁగాక. (లక్ష్మణునింజూచి) లక్ష్మణా! ఏమిది! ఇంతకోపమేల? ఎవ్వరిపైన నాగ్రహము జూపుచుంటివి కారణము లేక భరతుని నేలదూషించెదవు. ఆతఁడు నీయెదుట లేఁడే! ఆతఁడేమి! నీపైకి దండెత్తివచ్చుటేమి! తమ్ముఁడా! నీకేమైన గ్రహము సోఁకెనా? పిచ్చిపట్టెనా? ఇటు రమ్ము.

లక్ష్మ—అన్నయ్యా! నాకు గ్రహముసోకలేదు. పిచ్చిపట్టలేదు, భరతుఁడు సైన్యసమేతుఁడై నీకేదియో యెగ్గు సలుపవచ్చుచున్నాఁడు. మీరారు చూడక యిట్లు పలుకుచున్నారు. భరతుఁడనగా

నేమోయని తలంచితిని. ఔరా దుర్మార్గుఁడు! ఎంతసాహసముఁ బూనెను.

తే. గీ. భక్తియంతయు నీరీతిఁ బారఁదోలి
యన్నయనుమాటఁ గూర్చిరత మున్నఁగలిపి
నీకుసిలుగులఁ గల్పించ నిక్కముగను
వచ్చినాఁడని జంపుఁడు భవ్యచరిత.

శ్రీరా—తమ్ముఁడా! శాంతివహించి యిటఁగూర్చుండుము. నీవెంత యజ్ఞానాబ్ధిలోఁ బడితివి భరతుని యంతరంగ మెఱుఁగక యిట్లు పలికితివి. ఆతఁడు నాకెగ్గుసల్పువాఁడుగాఁడు. నాయందు మిగులభక్తిఁ బూని చరించువాఁడు. అట్టిభరతుఁడేమి నాకుఁ గీడు సేయవచ్చెనేమి.

లక్ష్మ—భరతుఁడువచ్చుట యసత్యమందురా యేమి?

శ్రీరా—ఆతఁడు రావచ్చును. కాని యెట్టిదుష్కృత్యముఁ జేయుటకు రాఁడు.

లక్ష్మ—సమస్తమును దెలిసిన నీవట్లన్న నేనేమందును! భరతుఁడు నిన్ను దర్శించుటకు వచ్చినాఁడేని సైన్య మేల?

శ్రీరా—తమ్ముఁడా! ఆతనియూహ యిట్లుండును. మనల నెట్లయిన బ్రతిమాలుకొని దోడ్కొనిపోవలెనను తలంపుతో వచ్చుచుండును. అంతియెకాని వేఱొక దురభిప్రాయముఁ బూనిరాఁడు.

[అంత వసిష్ఠమహామునితో భరతుఁడు ప్రవేశము.]

[భరతుడు రామునికడకు ప్రవేశించి పాడెడిపాట] 22

ఫీల్వరాగం - ఏకతాళము.

ప॥ రామ। రామ। రామ। సీతారామకీజయ్॥ రామ॥

అ॥ ప॥ తామసంబుత్యజియించివినవే రామనామమంత్రమునకుసాటి
యేమిగలదు ధరపరయఁగ మనసా॥ రామ॥

నీమమునఁగో శ్రీరాముని త్రిజగత్ పూజ్యునిభజించితరించజనవే
యీమాయలోకభ్రాంతివహింపక ॥రామ॥

వసి—(తనలో) ఈభరతుఁ డింతదూరము శ్రమపడివచ్చెనుగాని, విఫల
మనోరథుఁడై మరల సాకేతమునకు మరలిపోవలసినవాఁ డేయ
ని తోఁచుచున్నది. ఏలయన సత్యవ్రతాచారపారీణుఁడును, జన
కాజ్ఞాపరిపాలకుండును, సాకొద్విష్ణు స్వరూపుఁడునునగు
శ్రీరామచంద్రుఁడు తాను బూనిన ప్రతినకు భంగముగా
వర్తించునా! అట్లెన్నటికి వర్తింపఁడు.

భర—(వసిష్ఠునిఁజూచి)మునీంద్రా! ఆగుహుండు చెప్పిన ప్రదేశ
ము దేకదా.

వసి—అవును. అదిగో! ఎదుటజూడుము.ఆవృక్షచ్ఛాయను సీతారామ
లక్ష్మణు లాసీనులైయున్నారు. మనము వారిని సమీపింత
మురమ్ము.

భర—ఆహా! కాలమహిమ.

సీ. నరసౌధములయందు ♦ వసియించుపుణ్యుండు
వసియించుచున్నాఁడు ♦ వనములందు
హంసతూలికశయ్య ♦ నలరారుచుండుభోగి
తనరుచుండెను నేఁడు ♦ దర్భశయ్య
మేలైనహారాళి ♦ మేనదాల్చెడివాఁడు
తాల్చుచున్నాఁడు రు ♦ ద్రాక్షమాల
బట్టుబట్టలనెప్డు ♦ గట్టుచుండెడిభోగి
కట్టుచుండెను నార ♦ బట్టలెలమి

తే. గీ. భక్తిమీరంగ నెప్పుడు ♦ పరిజనంబు
గొలువకేవిమై తనరారు ♦ లలితచరితుఁ

దక్కటా భాగ్యములవీడి కే యడవులందుఁ
దనరుచున్నాఁడు నేఁడిదే కే ధాతవ్రాఁత.

అక్కటా! సీతామహాదేవి యెట్టి యిక్కట్లుబడుచున్నది. ఆలక్ష్మణుం డెట్లున్నవాఁడో. ఇంక నేనాలోచింపనేల. రామచంద్రుని సన్నిధాన మునకరిగి సమస్తమును విన్నవించి యయోధ్యకుఁ దోడ్కొనిపోయెద. (వసిష్ఠునిఁజూచి) మునీంద్రా! తండ్రిగారిమరణ మీరామునకెట్లు విని పింతును.

వసి—ఇంక రాముని జూతమురమ్ము.

(ఇరువురును శ్రీరాముని సమీపింతురు.)

లక్ష్మ—(రామునితో) అన్నయ్యా! వసిష్ఠసమేతుఁడై భరతుఁడువచ్చు చున్నాఁడు.

శ్రీరా—(లేచి) మునివర్యా! వసిష్ఠా! రాముఁడిదే మ్రొక్కుచున్నాఁడు.

లక్ష్మ—
సీత— } (మ్రొక్కుదురు)

శ్రీరా—(భరతునిజూచి) తమ్ముఁడా! భరతా!

తే. గీ. అడవులకు నేను వీరితో కే నరుగుదెంచు
నప్పుడీవుపురమున లే కే వుచు మదిని
నెంత యోగుందినాఁడను కే చింత చేతఁ
జూడ నైతిని నిన్నంచు కే శుద్ధచరిత.

భర—సోదరా! ఆపాపపుకైకగర్భమునఁబుట్టి నేనుగూడ నిందకుఁ బాలయితిని.

శ్రీరా—తమ్ముఁడా! ఇందు కైకమ్మగారుగాని నీవుగాని చేసినదేమున్న ది. తండ్రిగారి సత్యాశాసనము నేను శిరమున ధరించితిని.

భర—దురాత్మురాలగు నాతల్లి యట్టివరములు గోరఁగనే తండ్రిగారు ముందు వెనుక లారయక యిచ్చిరి. హానిని నీవుపాలింపఁదలంచి

వచ్చితివి. దీనివలన నెంతముప్పు వాటిల్లునో మీరు తలంప
నైతిరి.

భర—(కన్నీరుగార్చును)

శ్రీరా—అయ్యో! ఇట్లు కన్నీరు గార్చెదవేల ?

భర—అన్నయ్యా ! చెప్పుటకు నోరాడకున్నది.

శ్రీరా—(వసిష్ఠునిజూచి) మునీంద్రా! ఈతఁడు,

తే. గీ. కన్నులను నశ్రుబిందువుల్ గార్చుచుండె
కారణంబేమొగాని వల్కఁగలేదు
దయవహించి నీవైనను దప్పకిపుడు
తండ్రికుశలంబు జెప్పుమా తాపసేంద్ర.

వసి—వత్సా! రాఘవా!

ఉ. నీవిటులేగుదేరగను నీజనకుండు సమస్తసౌఖ్యముల్
బోవిడనాడి మానికుల పుంగవుఁడిచ్చిన శాపకారణం
బే విధియాట నీకొఱకు నెంతయుఁ జింతిలి రామ రామ స
ద్భావచరిత్ర పుత్రయని తద్దయుఁగుందుచు వీడె జీవముల్.

(సీతా, రామ, లక్ష్మణులు మూర్ఛిల్లుదురు.)

[దశరథుని మరణవార్త విని రాముఁడు పాడెడిపాట.]

ఫీలురాగం—ఆటతాళం.

ప॥ హా! నన్నుఁ బాసిపోతివా తండ్రి । జగత్పూజితచారిత్రయీ ధా
త్రిఁ ॥హా॥

అ॥ చ॥ రామా రామా యంచు నీ । ప్రాణంబు వీడితివా ।
రాముఁడే నీపాలిటి । మృత్యుదేవతయైపుట్టెనా ॥హా॥

యేమాడ్కి భరియింతుహా। యీవెతహృదయంబునఁ
యీమెయి నే నెట్లిక ।ధృతిబూని। జరియింతు । నయోజ
నకా॥హా మ॥

శ్రీరా—(మూర్ఛ తెలిసి) హా తండ్రీ! నిరంతర సత్యవ్రతాచార పారీణా!

మ. జనకా నీదగు సత్యశాసనము శ్రీ రంబందునం దాల్చి యీ
వనిలో నుండగ రాగ మాకొఱకు నీ భావంబునం బెంగ చేఁ
దనయా రాఘవరామయంచు ఘనచిం తాకాంత చిత్తుండవై
తను సీరీతిని వీడిపోయితివె య య్యా! యేమి సేతుం భువిన్.

తే. గీ. వనములకు మేమురధము పై వచ్చునపుడు
రధము వెంబడివచ్చుచు రామరామ
అపుమంచును బ్రతిమాల నాపనైతి
నెంత పాపిష్ఠినోగదా యెంచిచూడ.

తండ్రీ! యిట్లగునని కలనైనఁ దలంపనైతిని.

లక్ష్మ—హాతండ్రీ! నేను నీపై నాగ్రహించితినని దేవతాధామమున కరిగితివా.

సీత—హా దశరధనృపా! మేమడవులకరుదెంచుటయె నీమరణమునకు కారణము.

వసి—కుమారులారా! గతించినదానికి మీరిట్లు చింతించిన లాభము లేదు. ముందుకర్తవ్యమాలోచింపుఁడు.

శ్రీరా—అంతటి దయాపరుఁడగు జనకుని మరణము వలనఁ గలిగిన దుఃఖము నెట్లు మఱతును.

వసి—వత్సా! రాఘవా! నీకు సమస్తమును దెలియును. ఇంక నీవు చింత విడువుము.

భర—అన్నయ్యా! ఈదుఃఖము మనకందఱికిని సమానమే. కైకమూలమున నేనుగూడ మీ కాగ్రహము గలిగించితిని. మనలగన్నతండ్రిదివంబలంకరించె. మాతల్లి యీవరములుగోరుటని నీపాదసాక్షిగ నెఱుంగను. నీవు లేని రాష్ట్రము నేను బాలింతునా! ఆ రాజ్యలక్ష్మిని భరించుటకు నేను శక్తుండనగుదునా! కావున నా తల్లి యాచరించిన దోషమునుసైరించి నాయందు కృపవహించి పురంబునకేతెంచి పట్టాభిషిక్తుండవై మమ్మును ప్రజలను బాలింపుము.

శ్రీరా—తమ్ముడా! కైకమ్మగారివలన దోషములేదు. నేను తండ్రిగారి సత్యముగాపాడ నేతెంచితిని అదిపూర్తియగునంతకును బుర ప్రవేశము సేయుట ధర్మమునకు భంగము. నీవు చింతవిడిచి నాకు మారుగ రాజ్యము బాలింపుచుండుము. వనవాసము పూర్తియైనపిదప నే వచ్చెదను.

భర—అగ్రజా! నీవెంత చెప్పినను సరే. నీవులేని పురమును నేనుబ్రవేశింపఁజాల. నీపాదసేవ జేయుచు నిచ్చటనుండెదను.

శ్రీరా—అంతసాహసమువలదు.

భర—అట్లైన నే నేమిచేయుదును?

శ్రీరా—అది గురులానతిత్తురు.

వసి—(భరతునిజూచి) భరతా! శ్రీరామచంద్రుఁడు వచించినమాట నిక్కము. నీవీతనిపాదుకలఁగైకొని వానికభిషేకము జేసి రాముఁడువచ్చువఱకు వానికిమారుగ రాజ్యమేలుము. (రామునిఁజూచి) రామచంద్రా! నీపాదుకల నీతనికనుగ్రహింపుము.

శ్రీరా—ఆనతి ననుసరించెద (పాదుకల భరతునికిచ్చును.)

[పాదుకలు శిరమునధరించి భరతుడు పాడెడిపాట.]

సురటరాగం—ఏకతాళం

ప॥ ధన్యుడనైతినీపాదుకలనుగొనిధన్యుడనైతినిధరణినిక౯ ।ధన్యు॥

అ॥ ప॥ అన్యులుమెచ్చగ । సర్వరాజ్యమీ । పాదుకలకు పట్టాభి
షేకముజేసి దోసిలొగ్గి సేవజేసెద ॥ధన్యు॥

అన్యచింతలిక నాకేలను శ్రీరాముభజించి తరించెదనిక॥ ధన్యు॥

భర—ఈపాదుకల కభిషేక మిచ్చటనే యొనర్చెదంగాక!

వసి—ఇచ్చటం బ్రీరము లేదే!

భర—వీనిని నాశిరమున ధరింతును. (శిరముపైం బెట్టుకొనును)

వసి— .(ఉదకముజల్లును)

శ్రీరా—భరతా

తే. గీ ప్రజల బిడ్డలభాతి గా \ పాడుమయ్య
ధర్మమందున నిల్పుచి \ తంబునెపుడు
సత్యమేజయమని మాన \ సంబునందు
గట్టిగానమ్మి పాలింపు \ కౌశలంబు.

(తెఱనాలును)

[సమాజికులందరు కలసి పాడెడిపాట]

జయంత శ్రీరాగ—ఏకతాళం.

ప॥ తల్లీ—పార్వతీ యుదేశారతి॥ తల్లీ॥

అ॥ ప॥ యుల్లములరర౯ గైకొని । చల్లనిచూపుల౯ గని మమ్మేలుము॥
తల్లీ॥

ముల్లోకములకు మూలమైవిల।సిల్లిమహిమను విరజల్లీ భక్తు
లనేలెడి ॥తల్లీ॥

సంపూర్ణము.